మహిళా సాధికారత ద్విదశ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక


సంపుటి : 20 సంచిక: 11


రంగారెడ్డి జులై 2022

పేజీలు : 36 వెల : రూ. 10/-





2007 మార్చి సంచిక




తొలి సంచిక ...2002 జులై




2012 జనవరి సంచిక




2017 డిసెంబర్ సంచిక




2022 మార్చి సంచిక

mas

MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత


స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

# @ 20

ఏపిమాస్ **21** వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మహిళా సాధికారత **20** వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

PRAGATI OFFSET ప్రగతి ఆఫ్‌సెట్ NABARD నాబార్డ్ సౌజన్యంతో ....


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
మరుగుదొడ్డి ఉపయోగించడం వల్ల మీకు కలిగే ప్రయోజనాలు:
• మీ ఇంటిలో పరిశుభ్రత ఉంటుంది • వివిధ జబ్బులకు దూరంగా ఉంటారు
• ఆరోగ్యకరమైన మరియు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది
• పరిశుభ్రంగా ఉంటారు మరియు కరోనాను దూరంగా పారదోలతారు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 20 సంచిక 11



సంపాదకీయం

## అరుదైన విజయం !

జంట విశేషాల శుభవేళ మిమ్ములనందరినీ పలకరించడం ఆనందంగా వుంది. అందరికీ శుభాభినందనలు, ధన్యవాదాలు! జులై 1 వ తేదీ ఏపిమాస్ ఆవిర్భావ దినోత్సవం. 2001 జులై 1 వ తేదీన అభివృద్ధిరంగంలో ఒక నూతనోత్తేజానికి నాంది పలుకుతూ 'మహిళాభివృద్ధి సొసైటి – ఆంధ్రప్రదేశ్' పేరిట ఏపిమాస్ అసంఖ్యాక అసంఘటిత పేదప్రజల, ముఖ్యంగా మహిళల జీవితాలలో ఎనలేని వెలుగులను విరజిమ్మే 'స్వయంసహాయ' దివ్య మంత్రోపదేశంతో తొలి అడుగు వేసింది. గత 21సంవత్సరాలుగా ఏపిమాస్ ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు యితర అనేక రాష్ట్రాలలో, మన దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఎన్నో నాణ్యమైన, ప్రభావోత్పాదకమైన, ఫలప్రదమైన, సుస్థిరాభివృద్ధి కారకమైన తన విశిష్ట సేవలతో పేద మహిళల జీవితాలలో మేలి మలుపులకు చిరునామాగా మారింది. ఏపిమాస్ ఆవిర్భవించిన సరిగ్గా సంవత్సరానికి, అంటే 2002 జులై 1 వ తేదీన మరో విశిష్ట విశేషం ఆవిష్కృతమైంది. అదే ఈ 'మహిళా సాధికారత' పత్రిక ఆవిర్భావం! స్వయంసహాయ మహిళలకు ఉపయోగకరంగా, వారి అవగాహనను, నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించే సమాచారాన్ని ఎప్పటికప్పుడు వారికి అందించాలన్న సత్సంకల్పంతో ప్రాణంపోసుకున్న 'మహిళా సాధికారత' పత్రిక నేటితో 20 వసంతాల తన నిత్యనూతన ప్రస్థానాన్ని పూర్తిచేసుకుని మూడవ దశాబ్దిలోకి అడుగిడుతున్నది. మహిళల జీవితాలలో నవాభ్యుదయ ప్రేరణను కలిగిస్తూ, స్ఫూర్తిని నింపుతూ, ఏపిమాస్‌కు అన్ని విధాల చేదోడువాదోడుగా, ఒక విశిష్టాభరణంగా ఈ పత్రిక రూపుదిద్దుకున్నది. 'ఏపిమాస్', 'మహిళా సాధికారత' అనేవి ఒకదానిని గురించి చెప్పగానే మరొకటి స్ఫురించే జంటపదాలుగా మారాయి. గత 20 ఏళ్ళుగా మహిళా సాధికారత పత్రిక నిరాఘాటంగా వెలువడుతూ, ఎన్నో వినూత్నమైన జీవనోపాధులను పరిచయంచేస్తూ, మహిళల స్వయంశక్తిని, స్వావలంబనను పెంచే విశిష్ట కథనాలతో మహిళల అభ్యున్నతికి బాటలు వేస్తున్నది. నిజానికి యిది ఏపిమాస్ ఎంతగానో గర్వించదగిన, తనను తాను అభినందించుకోదగిన చారిత్రక ఘట్టం! ఎందుకంటే ప్రత్యేకించి 'స్వయంసహాయ, మహిళా సాధికారత' రంగాల వార్తలకు అంకితమైన మరో పత్రిక ఏదీ తెలుగులోనే కాదు, ఇతర భారతీయ భాషలలో కూడా లేదు. పైగా, ఎన్నో వ్యయప్రయాసలతో కూడిన పత్రికా నిర్వహణను 20 ఏళ్ళుగా అవిచ్ఛిన్నంగా కొనసాగించడం సాధారణ విషయంకాదు. అదీ ఒక ఎన్ జి ఓ ఈ పని చేయగలగడం నిజంగా అసాధారణం! సొంత పత్రికను ప్రారంభించిన ఎన్ జి ఓలు అనేకం వున్నాయి. కాని నిర్వహణపరమైన సమస్యలతో అవి కొద్దికాలంలోనే మూతపడుతుంటాయి. చాలావరకు అవి సంస్థాగతమైన కార్యక్రమాల వార్తలకే పరిమితమవుతుంటాయి. మహిళా సాధికారత పత్రిక మాత్రం యిందుకు భిన్నంగా యిటు ఏపిమాస్ కార్యక్రమాల సమాచారాన్ని చేరవేసే సాధనంగా ఉపయోగపడుతూనే, మహిళలకు సంబంధించిన ఎన్నో యితర విషయాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తూ, మహిళా సాధికారతకు సర్వవిధాల అండగా నిలుస్తున్నది. నిస్సందేహంగా యిది అసాధారణం, ఒక అపూర్వ విజయం! ఇన్ని విశిష్టతలు వున్న ఈ పత్రికను ఎన్ని అడ్డంకులు ఎదురైనా కొనసాగించాలనే ఏపిమాస్ దృఢసంకల్పానికి తోడుగా నిలిచి తోడ్పాటు అందిస్తున్న దాతృత్వ సంస్థలకు, ఆదరిస్తున్న పాఠకులకు ధన్యవాదాలు. ఉపయోగకరమైన చక్కని సమాచారంతో పత్రికను తీర్చిదిద్దుతూ, క్రమంతప్పకుండా ప్రతి నెల సకాలంలో పత్రిక వెలువడడంలో సహకరిస్తున్న అసోసియేట్ ఎడిటర్ శ్రీ జె వి కృష్ణమూర్తి బృందానికి, సంబంధిత యితర సిబ్బందికి మన:పూర్వక అభినందనలు. ఈ ఇరవై ఏళ్ళ విజయం అందిస్తున్న స్ఫూర్తితో, ప్రోత్సాహంతో మరింత విశిష్టంగా, ప్రయోజనదాయకంగా, మరెన్నో దశాబ్దాలపాటు ఈ పత్రిక నిత్యనూతనంగా వెలువడాలని ఆకాంక్షిస్తూ, త్వరలోనే సామాజిక మాధ్యమాలలోను, ఇతర డిజిటల్ వేదికలలోను 'మహిళా సాధికారత' పత్రికను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పాన్ని మీతో పంచుకుంటూ, అన్ని విధాల మీ అందరి తోడ్పాటును, ఆదరణను ఆశిస్తూ మరోమారు మీ అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

టి. చంద్రశేఖర రెడ్డి

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana; Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12, HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda, Rangareddi District, Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**

అయోమయంగా పరుగు పెట్టడం కంటె ఆత్మ విశ్వాసంతో ఒక్కో అడుగు వేసినా ఎంతో మేలే

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....

➪ మహిళా సాధికారత 20 వసంతాల ప్రస్థాన పథం ...05
➪ స్వయంఅభ్యసనశిక్షణ కరదీపిక మహిళాసాధికారత ...07
➪ సుస్థిర జీవనోపాధుల పథకం–గిరిజనఅభివృద్ధినిధి ...10
➪ మహిళాసాధికారత .... అరుదైన పత్రిక ...12
➪ మహిళా సాధికారత ...గుర్తుకొస్తున్న జ్ఞాపకాలు! ...14
➪ మహిళా సాధికారత ... ఒక ప్రామాణిక పత్రిక ...15
➪ మహిళా సాధికారత పదేళ్ళ పదనిసలు ! ...16
➪ మహిళా సాధికారత దశాబ్ది ఉత్సవ జ్ఞాపికలు ...18
➪ బీహార్‌లో సంఘాలకు ఏపిమాస్ తోడ్పాటు ! ...21
➪ 'అనంత'లో ఉత్సాహంగా పర్యావరణ దినోత్సవం ...24
➪ ఆదర్శసమాఖ్యలకు ఏపిమాస్ జాతీయ స్థాయి శిక్షణ ...25
➪ 'మహిళా సాధికారత' ; పాఠకుల మనోగతం ! ...26
➪ సభ్యులకు లాభాలు పంచిన హసనపర్తి ఎఫ్‌పిసి ...27
➪ సహజీవనం వివాహంతో సమానం:సుప్రీంకోర్టు ...28
➪ టమాట సాగుతో రైతే రాజు ...29
➪ మామిడిలో కొమ్మకత్తిరింపులకు అదను ఇదే ! ...31
➪ మహిళా సాధికారత – వ్యాస రచయితలు, రచయిత్రులు (2002–22) ...33

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

కలను కళ్ళలో దాచుకుంటే కరిగి కన్నీరవుతుంది, గుండెలో పాదుకుంటే నెరవేర్చుకునే ప్రేరణ ఇస్తుంది

# 'మహిళా సాధికారత ' 20 వసంతాల ప్రస్థాన పథం!

– జె.వి. క్రిష్ణమూర్తి

*రెండు దశాబ్దాలుగా ప్రచురితమవుతున్న 'మహిళా సాధికారత' పత్రిక తన మాతృ సంస్థ ఏపిమాస్‌కు ఒక బలమైన ప్రచార సాధనంగా రూపొందడంతో పాటు, అభివృద్ధి రంగంలో చెరగని ముద్ర వేసింది. తొలినాళ్ళలో ఎక్కువగా స్వయంసహాయ మహిళలకు ఉపయుక్తమైన సమాచారాన్ని అందించడానికే ఎక్కువ ప్రాధాన్యం యిచ్చినప్పటికి, క్రమేణా మహిళల సంపూర్ణ సాధికారతను ఆవిష్కరించే కథనాలతోపాటు వివిధ రంగాలకు చెందిన వైవిధ్యభరిత కథనాలతో అందరి పత్రికగా ఎదిగింది. ఈ పత్రిక 20 ఏళ్ళ ప్రస్థానంలోని కొన్ని ఆసక్తికరమైన అంశాలను తెలుసుకుందాం.*

**ఎడిటర్:** శ్రీ టి. చంద్ర శేఖరరెడ్డి (సుపరిచితమైన పేరు సి. ఎస్. రెడ్డి)

**అసోసియేట్ ఎడిటర్(ర్స్)**

- మహిళా సాధికారత తొలి సంచిక నుంచి, 2005 జులై సంచిక వరకు శ్రీ నూనె శ్రీనివాసరావు ఒక్కరే.
- 2005 ఆగస్టు సంచిక నుంచి శ్రీ జె.వి. క్రిష్ణమూర్తి తోడైనారు.
- 2006 అక్టోబర్ సంచిక నుంచి శ్రీ జె.వి. క్రిష్ణమూర్తి ఒక్కరే కొనసాగుతున్నారు.

⇨ తొలి నాలుగు సంచికలకు శ్రీ సి.ఎస్.రెడ్డి ప్రధాన సంపాదకులుగా (ఛీఫ్ ఎడిటర్), శ్రీ నూనె శ్రీనివాసరావు సంపాదకులుగా (ఎడిటర్) వ్యవహరించారు.తర్వాత సాంకేతిక కారణాలవల్ల, శ్రీ సిఎస్ రెడ్డి సంపాదకులుగా, శ్రీ నూనె శ్రీనివాసరావు సహసంపాదకులుగా వ్యవహరిస్తూ వచ్చారు.

⇨ 2004 జులై సంచికవరకు ప్రచురణకర్త హోదాలో టి. చంద్రశేఖరరెడ్డి పేరు, సంపాదక హోదాలో సి.ఎస్. రెడ్డి పేరు వుండేది. 2004 ఆగస్టు సంచిక నుంచి ' రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా' ఆర్ ఎన్ ఐ సూచన మేరకు రెండు చోట్లా టి. చంద్రశేఖర రెడ్డి అనే ఒకే పేరును పేర్కొంటున్నారు.

**ఒకే ఒక్కటి !**

***స్వయంసహాయ వ్యవస్థ, మహిళా సాధికారత ప్రధానాంశాలుగా వెలువడే పత్రిక తెలుగులో "మహిళా సాధికారత" మినహా మరొకటి లేదు ! తెలుగులోనే కాదు ఇతర భారతీయ భాషలలోనూ ప్రత్యేకంగా ఈ అంశాలపై పత్రిక ఏదీ లేదని 'గూగుల్ అన్వేషణ తెలుపుతోంది. మనదేశం వరకు ఆంగ్లంలో కూడా ఈ తరహా పత్రిక మరొకటి లేదు. ఎంతో వ్యయ ప్రయాసలతో, సవాళ్ళతో కూడిన పత్రికా నిర్వహణను ఒక ఎన్ జి ఓ (ఏపిమాస్) 20 ఏళ్ళపాటు సమర్థంగా, అవిచ్ఛిన్నంగా నిర్వహించడం మరొక అరుదైన విషయం!***

⇨ పేజీలు : మొదట్లో 24 పేజీల సంచిక ; 2003 అక్టోబర్–నుంచి 36 పేజీలైంది.

⇨ వెల: 24 పేజీల సంచిక వరకు 7 రూపాయలు, అక్టోబర్–2003 నుంచి 36 పేజీలతో 10 రూపాయలు.

**సంపాదకీయ సలహా సంఘం**

మహిళా సాధికారతకు సంపాదకీయ ప్రత్యేక సలహా సంఘం 2003 జనవరి సంచికతో మొదలై, 2004 జులై సంచికతో ముగిసింది.

సంఘంలో మొదటినుంచి చివరిదాకా మాధవీలత కొనసాగారు. 2003 సెప్టెంబర్ సంచిక నుంచి విజయభారతి చేరి, 2004 మార్చి సంచిక వరకు కొనసాగారు. 2004 నవంబర్ సంచిక నుంచి ఏపిమాస్ సలహా సంప్రతింపుల సంఘం సభ్యులే మహిళా సాధికారత సలహా సంఘ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ

పేర్కొంటున్నవారు కొద్దికాలం పాటు సంపాదకీయ సంఘంలో సభ్యులుగా వున్నారు.

వారు : ఎల్. బ్రహ్మ ప్రకాశ్, ఎస్. రామలక్ష్మి, బి. ఆంజనేయులు, ఏ.వి.ఆర్. కుమార్, వై. రామకృష్ణ, తిరుపతయ్య, రమేష్ రెడ్డి, ఫణిప్రియ, నాగార్జున, సునీతా ప్రసాద్, ప్రభావతి, సి. నారాయణరెడ్డి, ఎన్. వినాయకరెడ్డి, ఎన్. బాలపోచయ్య (బోటనిస్ట్), ఏ.వి. రాజా (అపార్డ్), కె. లుగేంద్రనాథ్ పిళ్ళై, బి. వెంకటేశ్వర్లు, సురేష్ (వాసన్), ఎన్.జె.విద్యాసాగర్, పి. మంజుల, కె. వరలక్ష్మి , వి. సమత, బి. గీతాంజలి , మాధవీలత.

**డిటిపి డిజైన్**

వై. ఆరోగ్యరెడ్డి (2004 డిసెంబర్ వరకు), కన్నన్ – 2005 జూన్ సంచిక నుంచి, ఎం. శివరామకృష్ణ (2006 మే సంచిక నుంచి 2010 మే సంచిక వరకు), బి.శ్రీకాంత్రెడ్డి (2010 జూన్–సెప్టెంబర్ సంచికలకు), కె. మస్తాన్‌వలి – 2011 జూన్ సంచిక నుంచి 2018 నవంబర్ సంచిక వరకు. శ్రీమతి ఎన్. రమాదేవి (ఔట్ సోర్సింగ్) – 2005 మే సంచిక నుంచి యిప్పటికీ కొనసాగుతున్నారు.

**చిత్రకారులు (కొంతకాలంపాటు) :**

ఇంద్రజిత్, కె. భాస్కర్

**ప్రచురణ**

కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్

**ఆర్థిక సహకారం, ప్రకటనల సౌజన్యం**

*గతంలో :* ఆగాఖాన్ ఫౌండేషన్, యూరోపియన్ కమిషన్ భాగస్వామ్యంలోని స్కేల్ ప్రాజెక్ట్, నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం, ఆంధ్రాబ్యాంక్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం – ఆంధ్రప్రదేశ్, స్టేట్ బ్యాంక్

*ప్రస్తుతం :* నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం, ప్రగతి ఆఫ్‌సెట్

**ప్రతులు:**

ప్రతి నెల 5,000 ప్రతులను (కాపీలను) ముద్రించి, పంపిణీ చేస్తున్నారు.

**ఉచితమే అధికం:**

పాఠకులకు, ముఖ్యంగా అభివృద్ధి రంగంలోని సంస్థలకు వ్యక్తులకు సంబంధిత వివిధ విషయాలపైన అవగాహన కల్పించడం, జ్ఞానాభివృద్ధి, సామర్థ్యం పెంపుదల ప్రధాన ఆశయాలుగా ప్రచురిస్తున్న పత్రిక కావడంవల్ల చందాదారుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఏపిమాస్ భాగస్వామ్య సంస్థలకు, స్వయంసహాయ సమాఖ్యలకు, ఎఫ్‌పిఓలకు, నాబార్డ్ కార్యాలయాలకు, సంబంధిత ప్రభుత్వ శాఖాధిపతులకు, కొన్ని ఎన్ జి ఓలకు, అభివృద్ధి రంగ నిపుణులకు, ఇతర ప్రముఖులకు మహిళా సాధికారత పత్రికను ప్రతినెల ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

**గుర్తింపు:**

- మహిళా సాధికారతకు 2006 ఏప్రిల్‌లో 'రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా' (ఆర్ ఎన్ ఐ) ధ్రువీకరణ (APTEL/ 2003 / 16365) లభించింది.
- 2006 ఆగస్టు సంచిక నుంచి 'మహిళా సాధికారత' సంచికల బట్వాడాలో తపాలాశాఖ రాయితీ (గుర్తింపు ధ్రువీకరణ (LLI/RNP/H-HD-1064) యిస్తున్నది.
- కాకతీయ విశ్వ విద్యాలయం మహిళా సాధికారత పత్రికను ప్రామాణిక పత్రికగా గుర్తించి, ఈ పత్రికలో ప్రచురితమైన వ్యాసాలను పి హెచ్‌డి చేయడంకోసం పరిగణించడానికి అర్హమైనవిగా గుర్తించింది.
- ప్రముఖ తెలుగు దినపత్రిక 'ఈనాడు' సంస్థ మహిళా సాధికారత పత్రికకు నిరంతర చందాదారు కావడం ఒక విశేషం
- మహిళా సాధికారత నాణ్యతను, విషయ విశిష్టతను గమనించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలోని 'మెప్మా ' (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) తమ సంస్థ నిర్వహించే పత్రికను నడపవలసిందిగా ఏపిమాస్‌కు ప్రతిపాదించింది. ■

**సమస్యను చూసి భయపడితే అది రెట్టింపు భయపెడుతుంది, పట్టించుకోకపోతే పలాయనమవుతుంది**

# స్వయం అభ్యసన శిక్షణ కరదీపిక 'మహిళా సాధికారత' !

– వినాయక రెడ్డి & ప్రహల్లాద

"**మ**హిళా సాధికారత" సాధన దిశగా 2001లో ఏర్పాటైన ఏపిమాస్ సంస్థ ఆ దిశగా అనేక కార్యక్రమాలను చేపట్టినది. స్వయం సహాయక సంఘాలు, రైతు సంఘాలు, ఉమ్మడి అవసరాల సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు మొదలగు సంస్థలలోని సభ్యులను చైతన్యపరుచుట కొరకు వివిధ రకాల శిక్షణా కరదీపికలను ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు స్వచ్ఛంద సంస్థలు రూపొందించి అందరికి అందుబాటులో వుంచినప్పటికిని మారుతున్న పరిస్థితులకు అనుగుణం గా ఆ కరదీపికలలో మార్పులు రాక అవి నిశ్చలస్థితిలోనే ఉన్నందున ప్రజలకు పెద్దగా ఉపయోగ పడడం లేదనడంలో అతిశయోక్తి లేదు.




అందువలన మారుతున్న స్వయం సహాయక సంఘాలు, రైతు సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల అవసరాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలోని అనుభవాలను ఎప్పటికప్పుడు సేకరించి అందరికి అందించాలన్న సదుద్దేశంతో ఏపిమాస్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి గారి మానస పుత్రికగా ఉద్భవించిన నెలసరి పత్రికే "మహిళా సాధికారత".

2003వ సంవత్సరం నుండి ప్రతి నెల 5000 ప్రతులతో ఏపిమాస్ సంస్థచే ముద్రించబడి నిరంతరంగా, నిర్విరామంగా ఎంపిక చేయబడిన మహిళా సంఘాలు, రైతు సంఘాలు, రైతు ఉత్పత్తిదారు సంస్థలు, పట్టణ సంఘాలు, సమాఖ్యలు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అందుతూ, అందరి మన్నలను "మహిళా సాధికారత" పత్రిక పొందుచున్నది. ప్రస్తుతము ఏపిమాస్ సంస్థ ఆంధ్రప్రదేశ్, బీహార్ మరియు తెలంగాణా రాష్ట్రాలలో ప్రత్యక్షంగా తమ స్వంత సిబ్బందితోను అవసరమును బట్టి ఇతర రాష్ట్రాలలో స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారముతో అనేక కార్యక్రమాలను అమలు జరుపు చున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 21 మండలాలలో 24 రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఏర్పాటు చేసి 14000 కుటుంబాలతో వివిధ రకాల కార్యక్రమాలను అమలు జరుపుచున్నది. మరోవైపు నీరు & పారిశుద్ధ్యం పెంపొందించడమే లక్ష్యంగా "వాష్" కార్యక్రమమును "ఇందిరా క్రాంతి పథం" సిబ్బంది సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని అనేక జిల్లాలలో అమలు జరుపుచున్నది. 2022 జూలై మొదటి తేది నాటికి 20 వసంతాలు పూర్తి చేసుకొని 21 వసంతంలోని అడుగు పెడుతున్న మహిళా సాధికారత పత్రికను మరింత నవీకరించి ఎక్కువమంది పాఠకులకు చేరువ కావాలని ఏపిమాస్ సంకల్పించింది.

అందులో భాగముగా ఏపిమాస్ సిబ్బంది వివిధ రకాల స్టేక్ హోల్డర్స్ అనగా రైతు ఉత్పత్తిదారు సంస్థల అధ్యక్షులు. కార్యవర్గ సభ్యులు, సాధారణ సభ్యులు, రైతుమిత్రలు, ప్రభుత్వ అధికారులు మరియు ఇతర ముఖ్యమైన వ్యక్తుల నుండి "మహిళా సాధికారత" మాసపత్రికపై వారి ప్రతిస్పందనలను మరియు భవిష్యత్‌లో పత్రికను మరింత నవీకరించుటకు తగు సలహాలు, సూచనలను సేకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా ఏపిమాస్ కార్యక్రమాల అమలు సమన్వయకర్త శ్రీ ఎన్.వినాయక రెడ్డి మరియు ప్రాజెక్టు మేనేజరు శ్రీ ఎస్.ప్రహల్లాదలు ఏపిమాస్ కార్య క్రమాలలో కీలక భాగస్వాములతో మాట్లాడి మహిళా సాధికారత పత్రిక ఉపయోగముపై వారి అభిప్రాయాలను

**మహా సంపద కంటె ఒక చిన్ని మంచి ఆలోచన , కొద్దిపాటి కారుణ్యం చాలా విలువైనవి**

సేకరించారు. అందులో కొన్ని క్రింద తెలియజేయడం జరిగింది:

**రైతు సంఘాలకు సమాచార సాధనం**



ఏపిమాస్‌చే ముద్రించబడుతున్న మాస పత్రిక "మహిళా సాధికారత"లో ముద్రించబడే వివిధ అంశాలు అట్టడుగు స్థాయి రైతులు మరియు రైతు సంఘాల కార్యక్రమాలు, అనుభవాలు ఇతర ప్రాంతాలలోని రైతులకు చాలా బాగా ఉపయోగపడి వారిలో చైతన్యం కలిగిస్తున్నాయనడం లో అతిశయోక్తి లేదు. ఇటువంటి పత్రికను ముద్రించు చున్నందుకు ఏపిమాస్ సంస్థకు ధన్యవాదాలు.

*-శ్రీమతి లక్ష్మి ప్రసన్న,ఉద్యానశాఖ అధికారిణి, పుంగనూరు*

**మరింత మందికి చేరువ కావాలి**

మహిళా సాధికారతలో ముద్రించబడే సమాచారము పూర్తిగా రైతులకు ఉపయోగపడి, రైతులు మరింత చైతన్యవంతులు అగుటకు తోడ్పడు తున్నది. రైతులకు ప్రభుత్వము అంది స్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని , సంబంధిత వివరాలను క్షేత్రస్థాయిలోని రైతులకు అందించడం లో మహిళా సాధికారత పత్రిక పాత్ర ప్రశంసనీయం. గత 20 సంవత్సరాలుగా ముద్రితమై నవీకరణ దిశగా ముందుకు సాగుతున్న మహిళా సాధికారత పత్రిక మరింత మందికి చేరువ కావాలని కోరుకుంటున్నాను.



*-శ్రీమతి సంధ్య, మండల వ్యవసాయ అధికారిణి, పుంగనూరు*

**మహిళలగొంతు వినిపించే సాధనం**



మహిళా సాధికారత పత్రికలో ముద్రితమయ్యే అంశాలు పూర్తిగా రైతులకు మరియు మహిళా సంఘాలకు ఉపయోగ కరముగా వున్నవి, అంతేగాక "శిల్పి – శిల్పం" శీర్షికలో ముద్రించబడే వ్యక్తిగత గాధలు మరింతమంది మహిళలకు మనో ధైర్యం కల్పిస్తుంటాయి. రైతు సంఘాల అనుభవాలను ముద్రించడం వలన ఇతర రైతు సంఘాలకు చాల ఉపయోగముగా వున్నవి. ఇటువంటి మంచి పత్రికను ముద్రించుచున్న ఏపిమాస్ సంస్థకు ముఖ్యంగా సంస్థ సి.ఈ.ఓ శ్రీ సి.ఎస్.రెడ్డిగారికి ధన్యవాదాలు.

*-శ్రీమతి జి. సరోజమ్మ, రైతు మిత్ర, రామసముద్రం*

**రైతులకు, రైతు సంఘాలకు చాలా ఉపయోగము**

ఏపిమాస్ సంస్థ ప్రచురించే మహిళా సాధికారత పత్రికలో రైతులకు, రైతు సంఘాలకు చెందిన సమాచారము ప్రచురితమవుచున్నది. రైతుల అనుభవాలు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కుడా ముద్రితమవుట వలన మాలాంటి రైతులకు చాలా ఉపయోగం గా వున్నది. ఇటువంటి మంచి పత్రికను 20 ఏళ్ళుగా ప్రచురిస్తుండడం గొప్ప విషయం. పత్రికకు మా అభినందనలు.



*– శ్రీ ఆర్.చెంగారెడ్డి, ఎఫ్.పీ.ఓ మాజీ అధ్యక్షులు, రామసముద్రం*

**మహిళలకు మనో ధైర్యం కలుగుచున్నది**

ఏపిమాస్ సంస్థ ముద్రించే మహిళా సాధికారత పత్రికలో వచ్చే మహిళలకు సంబంధించిన సమాచారం చాలా ఉపయోగపడుతూ మాలాంటి మహిళలకు మనో ధైర్యం కలిగిస్తున్నది. శిల్పి – శిల్పం" శీర్షికలో నా గురించి ముద్రించబడింది. నా గురించి పది మందికి తెలియజేసినందుకు చాల సంతోషం అయింది. రైతు సంఘాల స్వయం అనుభవాలను ఇతర రైతు సంఘాలు తెలుసుకోవడానికి మహిళా సాధికారత ఎంతో ఉపయోగపడుతున్నది. ఈ పత్రిక మరెన్నో వార్షికోత్సవాలు జరుపుకోవాలని 20 వ వార్షికోత్సవ సందర్భంగా అభినందనలు తెలుపుతున్నాను.



*-శ్రీమతి పి.సరోజమ్మ, కే.సి.పల్లి గ్రామ రైతు సంఘం మాజీ కార్యదర్శి & ఆదర్శ రైతు*

**రైతుల వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతుంది:**

మహిళా సాధికారత పత్రికలో రైతులగురించి, వివిధ పంట యాజమాన్య పద్ధతుల గురించి, మహిళల విజయ గాధల గురించి ముద్రితమయ్యే వివిధ



అంశాలు ఎంతగానో స్ఫూర్తిదాయకంగా వుంటాయి. అందువలన ఈ పత్రిక చదివే వారికి కూడా వివిధ అంశాలపై మంచి అవగాహన కలుగుతుంది. ''శిల్పం'' శీర్షికలో నా గురించి ముద్రించబడింది. నా గురించి పది మందికి తెలియజేసినందులకు చాలా సంతోషం అయింది. ఇటువంటి మంచి పత్రికను ముద్రించు చున్న ఏపిమాస్ సంస్థకు ముఖ్యంగా సంస్థ సి.ఈ.ఓ శ్రీ సి.ఎస్.రెడ్డిగారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

*–శ్రీమతి కవిత, డైరెక్టర్,*

*కౌండిన్య రైతు ఉత్పత్తిదారుల కంపెని లి. పలమనేరు*

**రైతులకు శిక్షణ కరదీపికగా ఉపయోగపడుచున్నది**

మహిళా సాధికారతలో రైతుల గురించి, రైతు సంఘాల గురించి, రైతులు పండించే వివిధ పంటల యాజమాన్య పద్ధతుల గురించి, ఏ ఏ సమయాలలో ఏ పంటలు వేస్తే అనువుగా వుంటుంది అనే విషయాలు, దేశ విదేశాలలో



అభివృద్ధి రంగంలో రాణించిన మహిళల గురించి ప్రచురించడం వలన ఆ అంశాలు మాలాంటి మహిళలకు చాలా ఆత్మ విశ్వాసాన్ని, వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహనను కలిగించుచున్నది. అందువలన ప్రతి నెల మహిళా సాధికారత పత్రిక చదివితే రైతు సంఘాల సభ్యులు, ఇతరులు అనేక అంశాలపై అవగాహన పెంచుకోవచ్చు.

*శ్రీమతి ఎన్.రెడ్డెమ్మ, ఎఫ్.పీ.ఓ మాజీ అధ్యక్షులు,*

*రామసముద్రం*

**రైతు సంఘాల కార్యక్రమాలకు ప్రతిబింబం**

క్షేత్రస్థాయిలో రైతు ఉత్పత్తిదారు సంస్థలు చేపట్టిన కార్యక్రమాలను, ప్రదర్శన క్షేత్ర రైతులు చేపట్టిన వివిధ పంట యాజమాన్య పద్ధతులను సేకరించి ఇతర ప్రాంతాల



రైతులకు చేరవేయడంలో మహిళా సాధికారత పత్రిక ప్రధాన భూమిక పోషిస్తున్నది. మహిళా సాధికారతలో ప్రచురితమయ్యే ప్రతి అంశం కూడా రైతులకు చాలా ఉపయోగకరంగా వున్నాయి. ఒకవైపు రైతు సంఘాల సమాచారము, మరోవైపు వివిధ రంగాలలో రాణించిన మహిళల గాధలను ప్రచురించడం వలన ఈ పత్రికను చదివే అనేకమంది మహిళలకు చాలా మేలు జరుగుతున్నది. అంతేగాక ఈ పత్రికలో ప్రచురితమయ్యే కేస్‌స్టడీలు కూడా చాలా ఉపయోగ పడుచున్నవి. ఇంతటి ఉత్తమమైన పత్రికను విజయవంతంగా నిర్వహిస్తున్న ఏపిమాస్ సంస్థకు ముఖ్యంగా సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్. రెడ్డిగారికి పత్రిక 20 వ వార్షికోత్సవం సందర్భంగా అభినందనలు తెలియజేయుచున్నాను.

*–శ్రీమతి కృష్ణ రాధ, డైరెక్టర్, ఎం–టమాట రైతు ఉత్పత్తి దారుల కంపెని లి. మదనపల్లి*

వీరే కాకుండా ఇంకా పలువురు మహిళా సాధికారత పత్రికలో ముద్రితమయ్యే అంశాలు స్వయం అభ్యాస శిక్షణ కరదీపికలుగా ఉపయోగపడుతాయని చెప్పారు. ఒక స్వచ్ఛంద సంస్థ 20 సంవత్సరాల పాటు ఒక పత్రికను నిర్విరామంగా నిర్వహించడం అనేది చాలా గొప్ప విషయం. ఈ పత్రికను నిరంతరంగా కొనసాగించుటకు కావలసిన ఆర్థిక సహాయం అందించుచు రైతులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందించాలన్న తపన కలిగిన ఏపిమాస్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్. రెడ్డి గారికి , రైతులకు, మహిళలకు, స్వయంసహాయ సంస్థలవారికి, ఎందరెందరికో ఉపయోగపడే వివిధ అంశాలను సేకరించి సకాలంలో పత్రికను ముద్రించి అందరికి అందించడంలో కీలక భూమిక పోషిస్తున్న అసోసియేట్ ఎడిటర్ శ్రీ జే.వి.కృష్ణమూర్తిగారికి పత్రిక 20 వ వార్షికోత్సవం సందర్భంగా మన:పూర్వక అభినందనలు. ఎంతో విజ్ఞానదాయకమైన, ఉపయోగకరమైన 'మహిళా సాధికారత' పత్రిక మరెన్నో వార్షికోత్సవాలను జరుపుకోవాలని ఆశిద్దాం. ■

మాటలతో, చేతలతో నొప్పించే వారికంటె, ఆత్మీయుల అనాదరణ మరింత బాధాకరం

# సుస్థిర జీవనోపాధుల పథకం-గిరిజన అభివృద్ధి నిధి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, 2021-22

**ఏకలవ్య ఫౌండేషన్ ...** గత 6 సంవత్సరాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలలో విద్య, ఆరోగ్యము, వ్యవసాయము మరియు జీవనోపాధుల రంగాలలో అనేక రకాల కార్యక్రమాలు చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసే ప్రయత్నం చేస్తున్నది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో బలమైన ప్రజాసంఘాలను నిర్మాణం చేసి వివిధ రకాల శిక్షణలు ఇస్తూ గిరిజనులను వారి సమస్యలు వారే పరిష్కరించుకునే స్థాయికి తీసుకురావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నది.

వ్యవసాయమే ముఖ్య జీవనాధారమైన మన భారతదేశంలో రైతుల ఆత్మహత్యలు జరగటం దురదృష్టకరం. రైతుకు–ఒకటికన్నా ఎక్కువ ఆదాయమార్గాలు ఉన్నపుడు రైతు ఎవరి మీద ఆధారపడకుండా తన కాళ్ళ మీద తాను నిలపడే అవకాశం ఉంటుంది.

దీనిని గమనించిన నాబార్డు, రైతుకు వ్యవసాయేతర మార్గాల ద్వారా అదనపు ఆదాయం కల్పించే దిశగా దేశంలో ప్రయోగాత్మకంగా కొమరంభీం అసిఫాబాద్ జిల్లాలోని, సిర్పూర్ మరియు లింగావార్ మండలాలలో 16 గిరిజన గ్రామాలలో రెండు సంవత్సరాల కాలంలో 500 గిరిజన కుటుంబాలను ఎంపిక చేసి వారికి ఉన్న పని కల్పించి ఆదాయం పెంచాలన్న సంకల్పంతో సుస్థిర జీవనోపాధుల పథకం అమలు పరుస్తున్నది.

ఈ పథకంలో భాగంగా 2021–22 సంవత్సరానికి గాను 5 కిరాణా షాపులు, 3 జిరాక్సు సెంటర్లు, 7 టెంట్ హౌస్‌లు, కుట్టుమిషన్‌లు, 102 మేకల యూనిట్లు గిరిజన కుటుంబాలకు ఇవ్వటం జరిగినది.




సుస్థిర జీవనోపాధుల పథకం ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న నాబజార్డు సి.జి.ఎం. ఓ వై కృష్ణారావు

అనుబంధం అంటే ఒకరిపట్ల ఒకరికి వుండే ఆత్మీయతే కాని, దీర్ఘకాల పరిచయమో, ఇచ్చిపుచ్చుకోడమో కాదు

వ్యవసాయమే జీవనాధారమైన ఆదివాసీలు పశు ప్రేమికులు. పాడి, పంట కలిస్తేనే వ్యవసాయం. వ్యవసాయంలో అంతంత మాత్రమే ఆదాయం ఉండడంతో వారికి అదనపు ఆదాయం రావటానికి వారి కోరిక మేరకు మేకలు యూనిట్లు ఇవ్వటం జరిగినది.

మహిళా సంఘాలలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఒక్కొక్క లబ్ధిదారుడికి 6 లేదా మేకలు పర్చేస్ కమిటీ ద్వారా కొన్పించటం జరిగినది. మేకల పెంపకంపై శిక్షణలు కూడా ఇవ్వటం జరిగినది. ఇలా మొత్తం 11 గిరిజన గ్రామాలలో 116 కుటుంబాలకు మేకల యూనిట్లు పంపిణీ చేయటం జరిగినది.







మేకల యూనిట్లు గ్రౌండ్ చేస్తున్న సి.జి.ఎం శ్రీ కృష్ణారావు, అడిషనల్ కలెక్టర్ శ్రీ వరుణ్‌రెడ్డి, ఏకలవ్య చైర్మన్ శ్రీ వేణుగోపాల్‌రెడ్డి

**నవ్వించినా, ఏడ్పించినా గత స్మృతులు మనసును ఉత్తేజ పరుస్తూనే వుంటాయి**

# ‘మహిళా సాధికారత’ అందరికీ ఉపయోగపడే అరుదైన పత్రిక!

**ఏపిమాస్ వ్యవస్థాపక సి ఇ ఓ, ఎం డి; ‘మహిళా సాధికారత’ పత్రిక వ్యవస్థాపక సంపాదకుడు, అభివృద్ధిరంగానికే అభివృద్ధి పాఠాలు నేర్పుతూ దేశవిదేశాలలో ప్రఖ్యాతిగాంచిన నిపుణుడు, శ్రీ సి ఎస్ రెడ్డి తో ‘మహిళా సాధికారత’ పత్రిక ఆవిర్భావ, ప్రగతి ప్రస్థానాలపై ఏపిమాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఎం ఇ ఎల్) శ్రీ కాకర్ల రాజశేఖర్ జరిపిన ఇంటర్వ్యూ యిది. ఇంటర్వ్యూ విశేషాలను చూద్దాం ....**

---

**రాజశేఖర్:** చంద్రశేఖర రెడ్డిగారూ, ఇరవై ఏళ్ళపాటు నిరాఘాటంగా ఒక పత్రికను నడపడం సాధారణ విషయం కాదు. ఇందుకు ముందుగా మీకు హృదయ పూర్వక అభినందనలు.

**సి ఎస్ రెడ్డి:** ధన్యవాదాలు.

**రాజశేఖర్:** ఏపిమాస్ సంస్థలో ఒక అవిభాజ్యమైన అంశంగా మహిళా సాధికారత పత్రికను మీరు రూపుదిద్దినట్టున్నారు కదా! మహిళా సాధికారత పత్రికను ప్రారంభించిన ఉద్దేశమేమిటి? ఆ ఉద్దేశం నెరవేరిందా?



**సి ఎస్ రెడ్డి:** స్వయంసహాయ రంగానికి అవసరమైన సమాచారాన్ని అందించడం, అవగాహనను పెంచడం‘మహిళా సాధికారత’ పత్రికను ప్రారంభించడంలోని ప్రధాన ఆశయం. ఇప్పటి మాదిరి ఆరోజుల్లో, అంటే 20 ఏళ్ళ క్రితం, ఇంటర్నెట్ వినియోగం అంతగా లేదు. సాంకేతికతను వినియోగించుకునే పరిస్థితి కూడా అంతంతమాత్రమే. మేము స్వయంసహాయ సంఘాలకు (ఎస్ హెచ్ జి లకు), వాటి సమాఖ్యలకు,వారికోసం పనిచేసే వివిధ సంస్థల సభ్యులకు, సిబ్బందికి, చివరకు ప్రభుత్వానికి కూడా ఎస్ హెచ్ జి లను, ఫెడరేషన్లను ప్రామాణికంగా నిర్వహించుకోవడం ఎలా, విధివిధానాలేమిటి తెలియ జేయాలన్నది మా సంకల్పం. స్వయంసహాయ రంగంలోని వారి అవగాహన పెంచడంకోసం మేము ఎన్నో కరదీపికలు, సమాచార పత్రాలు, పోస్టర్లు, విడియోలను రూపొందించాలను కున్నాం. నెలనెలా ఆ సమాచార సారాంశాన్ని చేరవేసే సాధనంగా మహిళా సాధికారత పత్రిక ఉపయోగపడేది. స్వయంసహాయ సంఘాలకు, వాటి సమాఖ్యలకు స్ఫూర్తి దాయకమైన సమాచారాన్ని అందించడంతో పాటు ఆచరణాత్మక అవగాహనను, కేస్ స్టడీలను, విజయ గాథలను, ఉత్తమ పద్ధతులను గురించి తెలియజేయడం ఈ పత్రిక స్థాపనలోని ముఖ్య ఉద్దేశం.

నెలనెలా వేలాది ప్రతులను ముద్రించి ఉభయ తెలుగు రాష్ట్రాలైన (నాడు ఉమ్మడి రాష్ట్రమే) ఆంధ్రప్రదేశ్, తెలంగాణా వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం చేరవేసే వాళ్ళం. పత్రికలో తమ పేరు, ఫోటో చూసు కోవడం వారికి ఎంతో ఉత్సాహంగా, ప్రేరణగా వుండేది. మరింత నాణ్యంగా, సమర్ధంగా తమ సంస్థలను నడుపుకోవాలన్న స్ఫూర్తి వారికి కలిగేది. బయటివారికే కాదు, ఏపిమాస్ సంస్థలోని వారికి కూడా మా కార్యక్రమాల వివరాలను లిఖితరూపంలో పెట్టడానికి ఈ పత్రిక ప్రేరణగా ఉపయోగపడు తుందని కూడా మేము ఆశించాం. ఎందుకంటే మాది నిరంతర అధ్యయన సంస్థ. మా సంస్థ పాటించే మౌలిక విలువలలో నిరంతర అధ్యయనం అనే అంశం కూడా వుంది. అధ్యయనం నిలిచిపోతే మనిషి మనుగడ ఆగిపోయినట్టే ! అందుకే ఈ పత్రిక క్షేత్రస్థాయిలో పని చేసేవారికి, స్వయం సహాయ మహిళలకు, ఎఫ్ పి ఓ లలో సభ్యులైన రైతులకు, ఇతర సామాజిక వర్గాలకు ఒక ప్రామాణిక సమాచార గ్రంథంగా (రిఫరెన్స్ బుక్) ఉపయోగపడాలని మేము భావించాం. బహుశా ప్రస్తుతం పుస్తకాలు చదివే అలవాటు తగ్గినట్టు వుంది. అందువల్ల మహిళా సాధికారత పత్రికను

స్నేహితుడికన్నా మిన్నగా ఒక్కొక్కసారి విరోధే విలువైన పాఠాలు నేర్పుతాడు

ఆశించినంతగా ఉపయోగించుకుంటున్నారా అనేది నిర్ధారించుకోలేం. ఏమైనా ఈ పత్రికకు తప్పకుండా చదవడానికి అలవాటుపడిన కొంతమంది పాఠకులు వున్నారు, వారు స్వయంసహాయ సంఘాలు, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక చేకూర్పు వంటి అంశాలపై ప్రచురితమవుతున్న కథనాలను చదువుతున్నారు, వాటిని ఉపయోగించుకుంటున్నారు. మహిళా సాధికారతకు చందాదారులు వుంటే పత్రిక ఎంతమందికి చేరుతున్నది అనేది నిర్ధారించుకోవచ్చు, కాని మేము మొత్తం దాదాపు ఉచితంగానే పంపిణీ చేస్తున్నందువల్ల యిలా నిర్ధారించుకోవడం కుదరదు.

**రాజశేఖర్:** పేరును బట్టి చూస్తే ఈ పత్రిక కేవలం ఏపిమాస్ అంతర్గత కార్యక్రమాలకు పరిమితమైన ఆర్గనైజేషనల్ న్యూస్ లెటర్ కాదనిపిస్తుంది, మరి ముఖ్యంగా మహిళలకు సంబంధించిన యితర అంశాలకు కూడా యిందులో చోటు కల్పిస్తున్నారా?

**సి ఎస్ రెడ్డి :** మహిళా సాధికారత కేవలం ఏపిమాస్ సంస్థాగత సమాచారానికి మాత్రమే ఎంతమాత్రం పరిమితమైంది కాదు. ఈ పత్రిక అందరిదీ. సమాజానికి ఉపయోగపడే సముచితమైన వ్యాసాలను ఎవరు పంపినా మహిళా సాధికారతలో ప్రచురిస్తాం. సామాజిక అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మహిళల హక్కులు, చట్టాలు, స్వయంసహాయ మహిళల , వారి సంస్థల బాధ్యతలు మొదలైన సమాజహితమైన వ్యాసాలను ఎన్నిటినో మహిళా సాధికారతలో ప్రచురించాం. కోవిడ్ సమయంలో పాటించవలసిన ముందు జాగ్రత్తలను గురించి కూడా ఈ పత్రిక ప్రచురించింది. సి ఎస్ ఏ, సెర్ప్, మెప్మా సంస్థల సమాచారాన్ని, కొన్ని ఇతర పత్రికలలలో ప్రచురితమైన వ్యాసాలను కూడా మా పాఠకుల అవగాహనకోసం మహిళా సాధికారతలో ప్రచురిస్తుంటాం. అనేక సందర్భాలలో సమాఖ్యలపైన, ఎఫ్ పి ఓలపైన, స్వయం నియంత్రణ కార్యక్రమంపైన, వాటర్‌షెడ్ల పైన, మహిళా దినోత్సవంపైన మహిళా సాధికారత ప్రత్యేక సంచికలను ప్రచురిస్తుంటాం. స్వయంసహాయ రంగానికి చెందినవారైనా, వ్యాపారాలను నిర్వహించేవారైనా, ఎఫ్ పి ఓల సభ్యులైనా ఏ రంగానికి చెందినమహిళలైనా సరే వారు ఏమి చేయగలరో, ఎలా చేయాలో తగిన అవగాహన కలిగించేలా మహిళా సాధికారత తోడ్పడాలన్నది మా ఉద్దేశం. అందించే సమాచారం సరళంగా వుండాలి, సులువుగా అర్థంకావాలి. ఆ దిశగా అసోసియేట్ ఎడిటర్ శ్రీ కృష్ణమూర్తి గత పదిహేనేళ్ళకు పైగా ఈ పత్రికను ప్రతినెలా చక్కగా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం పత్రిక నాణ్యత చాలా బాగుంది. మార్కెటింగ్ లేకపోవడం, ఎవరికి అందుతున్నదో, ఎవరికి అందడంలేదో తెలియక పోవడమే మహిళా సాధికారత పత్రికకు వున్న సమస్యలు. మరిన్ని మంచి ఫలితాలను సాధించడానికి శ్రీ కృష్ణమూర్తికి తోడుగా మరో యిద్దరు, ముగ్గురు కలసి పనిచేసే ఏర్పాటు చేయాలనే ఆలోచన వుంది. ముఖ్యంగా ఏపిమాస్ సిబ్బంది అందరిలో ఈ పత్రిక మనది అనే భావం పెంపొందితే ఎంతైనా సాధించవచ్చు.

**రాజశేఖర్:** ఈ పత్రిక స్థాపక సంస్థ అయిన ఏపిమాస్ తొలుత స్వయంసహాయ రంగంతో ప్రారంభించి, వాటర్ షెడ్స్, ఆదర్శ గ్రామాలు, మహిళల ఆరోగ్య సంరక్షణ, పట్టణ పారిశుద్ధ్యం, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు ... యిలా వివిధ నూతన రంగాలకు విస్తరించింది. మహిళా సాధికారత పత్రికలో ఈ రంగాలన్నిటికి తగిన ప్రాధాన్యం లభిస్తున్నదా?

**సి ఎస్ రెడ్డి :** కచ్చితంగా. గతంలో ఎస్ హెచ్ జిలు, ఫెడరేషన్లను గురించి ప్రచురించే వాళ్ళం. ఇప్పుడు మహిళా సాధికారతలో పాడిపశువుల నిర్వహణ, వ్యవసాయంలో విలువ గొలుసులపై అవగాహన, ఆదర్శ గ్రామాలు, పాఠశాలలకు మౌలిక వసతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్ పి ఓలు), పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ వంటి ఎన్నెన్నో వైవిధ్యభరితమైన వార్తాంశాలు, వ్యాసాలు పలకరిస్తుంటాయి. ఇది మాస పత్రిక కావడంతో సమాచార స్రవంతి ఆలస్యంలేకుండా, ఆగకుండా కొనసాగుతూనే వుంటుంది.మహిళా సాధికారత ఏపిమాస్ సంస్థ కార్యక్రమాలన్నింటిని ప్రతిబింబించే ఒక డైరీ లాంటిది, ఒక గర్తింపు చిహ్నం లాంటిది. చాలా మందికి ఏపిమాస్ తో అనుబంధం ఏర్పడడానికి మహిళా సాధికారత పత్రికే మూలమవుతున్నది. మన దేశంలో సంస్థాగతంగా పత్రికలు నడిపే ఎన్ జి ఓలు

(మిగతా 26వ పేజీలో ...)

# మహిళా సాధికారత ... గుర్తుకొస్తున్న జ్ఞాపకాలు!

– డాక్టర్ నూనె శ్రీనివాసరావు

*శ్రీ నూనె శ్రీనివాసరావు 'మహిళా సాధికారత' పత్రిక రూపకల్పనలో ప్రధానపాత్ర వహించిన తొలి అసోసియేట్ ఎడిటర్. మూడేళ్ళకు పైగా ఆయన ఆ గురుతర బాధ్యతను సమర్ధంగా నిర్వహించారు. ఏపిమాస్ సంస్థలో వున్నప్పుడు ఆయన ... శ్రీ నూనె శ్రీనివాసరావు గారే. అనంతరం 'పి హెచ్‌డి' చేసి డాక్టర్ శ్రీనివాసరావు అయ్యారు. ఏపిమాస్ తర్వాత 'సి–డాక్' తదితర సంస్థలలో పనిచేసిన శ్రీనివాసరావు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'ఖాదీ, గ్రామీణోద్యోగ సంస్థ' ముంబై శాఖలో ' కెపాసిటీ బిల్డింగ్, విజిలెన్స్' విభాగం డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. వారు సాధించిన ప్రగతికి 'మహిళా సాధికారత' అభినందనలు !*

---

మహిళాసాధికారత ప్రయాణం ఎలా మొదలైందంటే..... కేర్ సంస్థ, డి.యఫ్.ఐ.డి.సహకారంతో ఏపిమాస్ ఐదు సంవత్సరాల బిజినెస్ డెవలప్మెంట్ ప్లాన్ రూపొందించింది. అందులో ఏపిమాస్ సంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలకు, వారి స్వయం సహాయక సంఘాలకు చేరువ కావడానికి 'ఇన్ఫర్మేషన్ – ఎడ్యుకేషన్ – కమ్యూనికేషన్'లో భాగంగా రాష్ట్రస్థాయిలో వనరుల కేంద్రాన్ని, దానికి అనుసంధానంగా తెలుగులో మాస పత్రికను ప్రారంభించాలని సూచించింది.

**ఆరోగ్య స్రవంతి పత్రిక......**

ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్.రెడ్డి అప్పటికే 'కేర్' డైరెక్టర్‌గా పని చేసి ఉండడంవల్ల ఆయనకు 'అకాడమీ ఆఫ్ నర్సింగ్ స్టడీస్' వారు ప్రకాశమ్మ గారి నిర్వహణలో అప్పట్లో ప్రచురిస్తున్న 'ఆరోగ్య స్రవంతి' పత్రిక పట్ల అవగాహన ఉండేది. ఆ పత్రిక మహిళల ఆరోగ్యం పట్ల మహిళలను చైతన్యవంతులను చేస్తూ ఉండేది. ఆ కారణంగా మహిళా సాధికారత పత్రిక రూపకల్పనలో తొలుత ఆ ప్రభావం కొంత లేకపోలేదు.

**వినూత్న అంశాలతో మహిళా సాధికారత**

మహిళా సాధికారత మాసపత్రిక మొదటి సంచిక ముఖపత్రం (టైటిల్ పేజీ) ఆరోగ్య స్రవంతిని పోలి ఉన్నప్పటికీ, ప్రచురించిన అంశాల విషయంలో కొత్తదనానికి ప్రాధాన్యం యిచ్చాము. ఆనంద బాష్పాలనే కథ, వెలుగు పథకం సర్క్యులర్లు, మహిళా సాధికారతపైన, స్వయం సహాయక సంఘాలపైన వ్యాసాలు, పదకోశం, అంతర్జాల వెబ్‌సైట్లపై అవగాహన వంటి అంశాలును ప్రచురించాము. ఇప్పటికీ మొదటి సంచిక 'టైటిల్ పేజీ' అందిరిని ఆకర్షిస్తుంది. (ఈ ఇరవై ఏళ్ళ పత్రిక ముఖపత్రంలో తొలి సంచిక టైటిల్ పేజీని చూడవచ్చు).

**అంతా ఏపిమాస్‌లోనే.....**

ఏపిమాస్‌లోనే పూర్తిగా లే-అవుట్ డిజైన్ జరిగేది. జర్నలిజంపై అవగాహన లేనప్పటికి సిబ్బంది స్వయంగా వ్యాసాలు, కథలు రాసేవారు. పేజ్‌మేకర్ సాఫ్ట్‌వేర్‌లో, అనూ ఫాంట్‌తో పత్రిక రూపుదిద్దుకునేది. ఈ సందర్భంగా నలుగురిని గుర్తు చేసుకోవాలి. మొదటి పత్రికకు కవరు పేజీ డిజైన్ చేసిన శ్రీ కరుణాకరణ్, డి.టి.పి. తెలుగు టైపింగులో సహకరించిన శ్రీమతి ఎన్. రమాదేవి, శ్రీ ఆరోగ్య రెడ్డి, మొదటి మాస పత్రికను ప్రింట్ చేసిన కళాజ్యోతి ప్రింటర్స్, 'రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఇండియా కన్సల్టెంట్' శ్రీ రఘురామరాజు.

**ఏపిమాస్ సిబ్బంది ప్రముఖ పాత్ర**

ముఖ్యంగా ఏపిమాస్ సిబ్బంది ప్రతి వ్యాసాన్ని కుణ్ణంగా చదివేవారు. తప్పొప్పులను చెప్పేవారు. ఎవరిదో బాధ్యత అని కాకుండా... అందరి బాధ్యతగా భావించేవారు.

# మహిళా సాధికారత ... ఒక ప్రామాణిక పత్రిక

– ఎస్ రామలక్ష్మి

మహిళా సాధికారత (తెలుగు) మాస పత్రిక మొదటి సంచిక 2002 జులైలో వెలువడినది మొదలు గత 20 సంవత్సరాలుగా ఈ పత్రిక ఎస్ హెచ్ జి లు, సమాఖ్యలు, ఎఫ్ పి ఓలు, సి బి ఓల నాణ్యతను మెరుగుపరచడంపైన, జీవనోపాధులు, మహిళా సాధికారతకు సంబంధించిన సాంకేతిక పరమైన, నిర్వహణపరమైన సమాచారాన్ని క్రమబద్ధంగా అందిస్తూ వస్తున్నది.

విధానాలు, మార్గదర్శకాలు, ప్రభుత్వ పథకాలు, వివిధ అధ్యయనాల ఫలితాలను అందించడం, అభివృద్ధి రంగంలో కలిసి పనిచేసే సంస్థలకు ఉపయోగకరంగా ప్రచురణాంశాలలో కనీసం 50% సాంకేతిక సమాచారం వుండేలా మహిళా సాధికారత శ్రద్ధవహిస్తున్నది. ఆగాఖాన్ ఫౌండేషన్, నాబార్డ్, ఆంధ్రా బ్యాంక్, బ్రెడ్ ఫర్ ది వరల్డ్, ప్రగతి ప్రింటర్స్ మొదలైన సంస్థలు ఈ పత్రిక ప్రచురణకు కొంతమేరకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నాయి.

ఈ పత్రిక చిన్న వ్యాపారాలు, వ్యవసాయం మొదలైన వాటితో సహా జీవనోపాధికి సంబంధించిన వివిధ అంశాలను ప్రచురిస్తున్నది. అనేక ఎస్‌హెచ్‌జిలు, సమాఖ్య లు, ఈ పత్రికను తమ రిఫరెన్స్ బుక్‌గా ఉపయోగిస్తున్నాయి. ఏపిమాస్ తన శిక్షణ కార్యక్రమాలకోసం ఈ పత్రికను రిఫరెన్స్ మెటీరియల్‌గా కూడా ఉపయోగిస్తోంది. ప్రతినెలా 1వ వారంలో తాజా పత్రికను అందుకోవడం కోసం తాము ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని ఏపిమాస్ ద్వారా శిక్షణ పొందిన ఎస్ జి ఓలు, ప్రభుత్వ సంస్థల, శాఖల ప్రతినిధులు, కొంతమంది క్షేత్రస్థాయి సిబ్బంది నుండి వినడం ఆనందదాయకమైన విషయం. నిర్దిష్ట ప్రమాణాలతో పత్రికను నిత్య నూతనంగా తీసుకురావడానికి ఏపిమాస్ సంపాదకీయ సలహా బృందాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఈ బృందం తగు సమీక్షలు, సూచనలు చేస్తుంటుంది.

20 సంవత్సరాలుగా పరిస్థితులు అనుకూలించని సమయాలలో కూడా ప్రతినెలా నాణ్యంగా ఈ పత్రికను సమయానికి తీసుకురావడానికి కారకులైన శ్రీ సిఎస్ రెడ్డి, శ్రీ నూనె శ్రీనివాస్, శ్రీ జె వి కృష్ణమూర్తి, ఇతర సహచరులు చేసిన, చేస్తున్న కృషిని మనం అభినందించాలి. ■

---

చాలాసార్లు విజయ గాథలు, వ్యాసాలు రాయడానికి చొరవ చూపించేవారు. పత్రిక ఎడిటర్ చంద్రశేఖర్ రెడ్డిగారు, అసోసియేట్ ఎడిటర్ శ్రీ జె.వి.కృష్ణమూర్తి గారు పోషించిన పాత్రలు ప్రత్యేకంగా ప్రశంసించాలి.

**ఎన్నెన్నో అనుభవాలు**

కొత్తగా ఒక వ్యవస్థను సృష్టించడం కొంచెం కష్టమే. అటువంటిదే ఈ మహిళా సాధికారత మాస పత్రిక. దాని లక్ష్య సాధనలో అనుభవాలు ఎన్నో. బుక్ పోస్ట్‌లో బట్వాడా చేయడం, ఆర్.ఎన్.ఐ.నెంబరు రిజిస్ట్రేషన్, ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, వాటి అమ్మకాల ద్వారా స్వావలంబన తీసుకువచ్చే ప్రయత్నం వంటి అనుభవాలు... ఇప్పటికీ జ్ఞాపకం వస్తూ ఉంటాయి.

**పత్రిక కోసం ఎదురుచూస్తూ ఉండేవారు**

ఇప్పటికీ మహిళా సాధికారత పత్రికకు మిగత సమాచార సాధనాలకు ఎంతో అంతరం కనిపిస్తుంది. ఈ పత్రిక చెప్పే పేదలకు జీవనోపాధుల వివరాలు ఏ పత్రిక, అంతర్జాలం చెప్పదంటే దాంట్లో అతిశయోక్తి లేదు. ఎందు కంటే, అప్పట్లో కొంతమంది మహిళలు డైరక్టుగా ఏపిమాస్‌కు ఫోన్‌చేసి లేదా లేఖల ద్వారా...తమలో కల్గిన చైతన్యం గురించి చెప్పేవారు. తెలుగు ప్రాజెక్టులో పనిచేసే సి.సి.లు, ఏపియంలు, డి.ఆర్.పిలు ఈ పత్రిక కోసం ఎదురు చూసేవారు. ఈ పత్రిక ప్రత్యక్ష్యంగా లేదా పరోక్షంగా పోషించిన పాత్ర వెలకట్టలేనిది. ఈ పత్రికను నిరంతరం నిర్వహిస్తూ ఏమాత్రం నాణ్యత తగ్గకుండా సమాచారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. ■

# మహిళా సాధికారత పదేళ్ళ పదనిసలు !




2012 జులై 1వ తేదీన 'మహిళా సాధికారత' దశవార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో ఎడమనుంచి వరుసగా ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపిమాస్ వైస్ ఛైర్‌పర్సన్ శ్రీమతి నందితా రే, ఏపిమాస్ ఛైర్‌పర్సన్ శ్రీ కె మాధవరావు, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాదరావు, ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు శ్రీ బి ఎన్ యుగంధర్, ప్రణాళికా సంఘం మానవ వనరుల సంస్థ డైరెక్టర్ జనరల్ శ్రీ సంతోష్ కె మెహ్రోత్రా , 'గ్రామ్య' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ రుక్మిణీరావు.
వెనుక వరుసలో శ్రీ జె వి క్రిష్ణమూర్తి ప్రభృతులు

## పాఠక వాణి ... పాఠక వాణి ... పాఠక వాణి ... పాఠక వాణి ... పాఠక వాణి

**'మహిళా సాధికారత'** పత్రిక పదేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికలో పత్రిక పట్ల పాఠకుల అభిప్రాయాలు, అభినందనలు, సందేశాలు 'పాఠక వాణి' శీర్షికన ప్రచురితమయ్యాయి. నేటి పాఠకులకోసం నాటి పాఠకవాణి ...

### అభినందనలు

ఏపిమాస్ ఆధ్వర్యంలో ప్రచురితమవుతున్న 'మహిళా సాధికారత' మాసపత్రిక పదిసంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు మా గ్రామ సంఘం సభ్యుల తరపున అభినందనలు. ఈ పత్రికలో ప్రచురితమవుతున్న విజయగాథలు మా గ్రామసంఘ 'మహిళలకు స్ఫూర్తిగా నిలిచి, అభివృద్ధిపథంలో ముందుకు సాగడానికి తోడ్పడుతున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాము.

*– చిన్నాదేవి, ఖాదీ గ్రామ సంఘం అధ్యక్షురాలు, సోమగుట్టపల్లి గ్రామం, అనంతపురం జిల్లా*

### అవగాహన కలిగించే పత్రిక

మహిళా సాధికారత'లో ప్రచురితమైన అంశాల ద్వారా మార్కెటింగ్ పై అవగాహన ఏర్పడుతుంది. జీవనోపాధుల విశ్లేషణ చాలా అర్ధవంతంగా ఉంది. సూక్తులు మాకు బాగా నచ్చాయి. మాక్స్ చట్టం క్రింద హక్కులు, శాసనాత్మక వివరాలు బాగా అర్ధమయ్యేలా వున్నాయి. సంఘాలు చేసుకొనే కార్యక్రమాలపై విశ్లేషణలు చాలా బాగున్నాయి. మహిళల శక్తి సామర్ధ్యాలకు మహిళా సాధికారత అద్దం పడుతుంది. మహిళా సాధికారత పత్రికా చాలాకాలం వర్ధిల్లు!

*– సి.వి. అరుణ, జె.కె. పల్లి, అనంతపురం జిల్లా*

ప్రతి సమస్యకు ఎన్నో పరిష్కారాలు, నీకు తెలిసినవి అనేకం వున్నా తెలియనిది ఒక్కటైనా వుంటుంది

## స్ఫూర్తిదాయకం

**ఆం**ధ్రప్రదేశ్ స్వయం సహాయ ఉద్యమానికి ఏపిమాస్ సంస్థ తరఫున ఒక మాసపత్రికను నడపడం చాలా అభినందించదగ్గ విషయం. ఈ పత్రిక వలన రాష్ట్రంలో, దేశంలో స్వయం సహాయక సంఘ సభ్యులు ఎలాంటి విజయాలు సాధిస్తున్నారో, ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారో తెలుసుకోగలుగుతున్నాము. ఈ విషయం మిగతా సంఘాలకు, సంఘ సభ్యులకు స్ఫూర్తిదాయకం. అదేవిధంగా స్వయం సహాయక సంఘాలకు, సభ్యుల కుటుంబాలకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ విషయాలు (పావలా వడ్డీ, ఎన్ఆర్ఎల్ఎం వంటివి) వివరంగా తెలుసు కోగలుగుతున్నాము. మహిళా సాధికారతా మాస పత్రికను గత పది సంవత్సరములుగా నిర్విఘ్నంగా నడుపుతున్నందుకు ఏపిమాస్ సంస్థకు కృతజ్ఞతలు.

***–నారాయణమ్మ, శ్రీ గౌరీ స్వయంసహాయ సంఘం లీడర్, పశువత్తూరు, గంగవరం మండలం చిత్తూరు జిల్లా***

## 'ఉపాధి' వ్యాసాలు ఎంతో ఉపయోగకరం

**'మ**హిళా సాధికారత' మాసపత్రికను ప్రతినెలా చదువుతున్నాను. అందులో ఉన్న విషయాలను సంఘాల లోను, గ్రామ సంఘం సమావేశాలలోను, మండల సమాఖ్య సమావేశాలలో నేను వివరిస్తుంటాను. ముఖ్యంగా జీవనోపాధి అంశాలకు సంబంధించి మైనంపాటి భాస్కరరావు గారు సూచిస్తున్న అంశాలను వివరిస్తాను. సంఘాలకు వివిధ రూపాలలో నిధులు అందుతున్నవి. వాటికి ఎలాంటి జీవనో పాధులను ఉపయోగించుకోవాలో ఈ ఆర్టికల్ చాలా బాగా ఉపయోగ పడుతుంది. సంఘాలు తయారుచేసే ఉత్పత్తుల గూర్చి పత్రికలో ప్రచురించడం రాష్ట్రస్థాయిలో ఒకవిధంగా ప్రచారం అవుతుంది. తద్వారా వారికి మార్కెటింగ్ సులభతర మవుతుంది. మిగిలిన రాష్ట్రాల వారు, జిల్లాలవారు టెర్రకోట ఉత్పత్తులను సందర్శించారు. ఈ విధంగా జీవనోపాధి వివరాలను అందిస్తున్నందుకు పది వసంతాల మహిళా సాధికారత పత్రికకు అభినందనలు.

***– కెఎస్ హరినాథ్, ఏపియం, గంగవరం మండలం***

## స్వయం నియంత్రణపై అవగాహన

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రంలోను, దేశవ్యాప్తంగా మహిళల అభివృద్ధికి ఏపిమాస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం. మహిళా సాధికారత మాసపత్రికను గత పది సంవత్సరాలుగా నడుపుతున్నందుకు అనేక అభినందనలు. రాష్ట్రంలో,దేశంలో స్వయంసహాయక సంఘ సభ్యులు ఎలాంటి విజయాలు సాధిస్తున్నారో ఈ పత్రిక ద్వారా చక్కగా తెలుసుకోగలుగు తున్నాము. మా కామారెడ్డి క్లస్టర్లో మేము చేపట్టిన స్వయం నియంత్రణ ఉద్యమానికి సంబంధించిన సకల వివరాలను ప్రచురిస్తూ, మిగతా సమాఖ్యలకు, సంఘాలకు, సభ్యులకు స్వయం నియంత్రణ ఉద్యమంపై అవగాహన కలిగిస్తున్న తీరు అభినందనీయం. ఆ కార్యక్రమాలను రాష్ట్రస్థాయిలో తెలియజేస్తున్నందుకు మహిళా సాధికారత పత్రికకు మా కృతజ్ఞతలు. అదేవిధంగా స్వయం సహాయ సంఘాలకు, సభ్యుల కుటుంబాలకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలను, కార్యక్రమాలను (ఆరోగ్య సూత్రాలు, పావలా వడ్డీ, జీవనోపాధి కార్యక్రమాల వంటివి), రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో నిర్వహించిన సమా వేశాలలో చర్చించిన విషయాలను మహిళా సాధికారత పత్రికలో ప్రచురించడం వలన దేశ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సంఘాల సమాఖ్యల పనితీరు, అభివృద్ధి స్థాయి తెలుస్తున్నది. మహిళా సాధికారత మాస పత్రికను గత పది సంవత్సరములుగా నడుపుతున్నం దుకు ఏపీమాస్ సంస్థకు అభినందనలు, ధన్యవాదాలు.

***– అంజమ్మ, పర్యవేక్షక సమాఖ్య అధ్యక్షురాలు, కామారెడ్డి మండలం, నిజామాబాద్ జిల్లా***

## మహిళల గౌరవానికి ప్రతీక

**మ**హిళా సాధికారత ద్వారా రాష్ట్రంలో మహిళా సంఘాల పనితీరు, పరిస్థితులను తెలుసుకుంటున్నాము. మహిళా సాధికారత సూక్తులు బాగా నచ్చాయి. రైతులు, వాటర్ షెడ్ సమాచారం బాగా వుంది. మహిళల గౌరవానికి ప్రతీకగా ఈ పత్రికను భావించవచ్చు. మహిళా సాధికారత పత్రిక దీర్ఘకాలం కొనసాగాలి. ***– లక్ష్మీనరసమ్మ, సిఆర్పి, మలకవారిపల్లి. అమడగూరు మండలం, అనంతపురం జిల్లా***

పరిచయం అనుబంధం కాదు, అర్థంచేసుకోవడమే ఆత్మీయ బంధానికి మూలం



## మహిళా సాధికారత దశాబ్ది ఉత్సవ జ్ఞాపికల బహూకరణ

జ్ఞాపికలను స్వీకరించినవారు

మంత్రి శ్రీ మాణిక్య వరప్రసాద రావు | శ్రీ కె.మాధవరావు | శ్రీ యుగంధర్ | శ్రీ నూనె శ్రీనివాస రావు

శ్రీ జె.వి.క్రిష్ణమూర్తి | శ్రీ మైనంపాటి శ్రీనివాసరావు | డాక్టర్ కె.రాజారెడ్డి | డాక్టర్ కె.శ్రీధర్

శ్రీమతి మల్లిక | శ్రీమతి పి.లక్ష్మి | డాక్టర్ ఎ.ఉమాదేవి | శ్రీమతి బి.గీతాంజలి

శ్రీ కె.మస్తాన్ వలి | శ్రీ జి.శ్రీనివాస్ | డాక్టర్ కె.ప్రహ్లాద్ | శ్రీ ఎం.బి.రామమోహన్

## ప్రతి సమావేశంలో చర్చించుకుంటాం

**ఏ**పిమాస్ సంస్థ తరపున, ప్రభుత్వం తరపున స్వయం సహాయక సంఘాల సమాఖ్య గూర్చి రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో నిర్వహించిన సమావేశాలలో, చర్చించిన విషయాలను 'మహిళా సాధికారత' పత్రికలో ప్రచురించడం వలన దేశస్థాయిలో సంఘాలు, సమాఖ్యల పనితీరు, అభివృద్ధి స్థాయి తెలుస్తున్నది. సమాఖ్యలో నిర్వహించుకోవలసిన ఆదర్శవంతమైన కార్యక్రమాలను తెలుసుకొని మా సమాఖ్య ముందంజలో ఉంటూ మండలంలో ఆదర్శవంతమైన గ్రామ సంఘంగా ఉన్నది. మహిళా సాధికారత పత్రికలో ప్రచురితమవుతున్న ముఖ్యమైన అంశాలను మా సమాఖ్య ప్రతి సమావేశంలో చర్చించుకుంటున్నాము. జాతీయస్థాయిలో సంఘాలు, సమాఖ్యల వివరాలను తెలుపుతున్నందుకు మహిళా సాధికారతకు ధన్యవాదములు.

*– బిఎస్ మణి, సంఘమిత్ర, చిన్నూరు గ్రామ సమాఖ్య, గంగవరం మండలం, చిత్తూరు జిల్లా*

**సానుకూల ధోరణిలో అర్థంచేసుకునే స్వభావం వుంటే, కష్టమైనా, సుఖమైనా ఆనందమే**

## మా కార్యక్రమాలకు రాష్ట్రస్థాయి ప్రచారం

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళల అభివృద్ధికి ఏపిమాస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం. పత్రికలో మా జిల్లాలో జరిగే కార్యక్రమాల గురించి ప్రచురించడం మాకు చాలా సంతోషంగా ఉన్నది. మా జిల్లాలో జరిగే కార్యక్రమాలు రాష్ట్ర స్థాయిలో తెలిపినందుకు 'మహిళా సాధికారత' పత్రికకు కృతజ్ఞతలు, ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, వాటర్ షెడ్ కార్యక్రమాలు, సుస్థిర సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, మహిళలు నిర్వహిస్తున్న సంస్థల అభివృద్ధికి ఎన్నో సూచనలు, సలహాలు, నిర్వహణా పద్ధతులు ప్రచురించడం చాలా సంతోషం. – ***యం. శాంతమ్మ,అధ్యక్షురాలు, మండల మహిళా సమాఖ్య, పలమనేరు మండలం, చిత్తూరు జిల్లా***

## ఇతర రాష్ట్రాల సమాచారం తెలుసుకుంటున్నాం

**మ**న రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా మహిళా సంఘాల కార్యక్రమాలు, వాటి సమాచారం, అక్కడ ప్రయోగాత్మకంగా చేసిన విషయాలను ప్రచురిస్తున్న తీరు బాగా నచ్చింది. కొత్త కార్యక్రమాలను నమూనాగా తీసుకుని మన రాష్ట్రంలో చేయడానికి వీలుంది. మన రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకుంటున్నాము. జీవనోపాధులను గురించిన వివరాలు బాగా ఉంటాయి.

***– రమణానాయక్, ఎంబికె, పూలకుంటపల్లి క్లస్టర్, అమడగూరు మండలం, అనంతపురం జిల్లా***

## సూక్తులతో మానసిక వికాసం

**మ**హిళా హక్కులు, చట్టాలు ప్రతి మహిళా తెలుసుకోదగిన విషయాలు పొందుపరచిన పుస్తకరాజం మహిళా సాధికారత, జీవనవేదం, సంపాదకీయం, సూక్తులు చదవడం వలన మనస్సుకు నూతన ఉత్తేజం కలుగుతుంది. ఉపాధిలో మైనంపాటి శ్రీనివాసరావుగారి వివరణ చాలా బాగుంది. మహిళల గౌరవాన్ని అన్ని దిక్కులా "వ్యాపింపజేసే పుస్తకం మహిళా సాధికారత. ఇటువంటి మాసపత్రిక పదికాలాల పాటు వస్తూనే వుండాలి.

***– కె.వేములమ్మ, ఎంఎస్ లీడర్, తుమ్మల, అమడగూరు మండలం, అనంతపురంజిల్లా***

## అజెండా అంశంగా సమావేశంలో చర్చ

**మ**హిళా సాధికారత చదవడం వలన చాలా విషయాలు తెలుస్తున్నాయని చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండల మహిళా సమాఖ్య (ఎం ఎం ఎస్) అధ్యక్షురాలు సౌందర్యమ్మ తెలియ జేశారు. ముఖ్యంగా సమాఖ్య నిర్వహణ విధానాలు, ఎస్‌పిఎం, పద్ధతులు, జనరల్ బాడీ నిర్వహణ, ఇతర రాష్ట్రాలలో సంఘాల పనితీరు, జీవనోపాధులు గురించిన విషయాలను తెలియజేస్తూ, చక్కని సూక్తులు అందిస్తూ ఈ పత్రిక తమకు ఎంతో ఉపయోగకరంగా వున్నదని ఆమె తెలిపారు. అందువల్ల, ఇకపై ఎం.ఎం.ఎస్ ప్రతి సమావేశంలో ఆ నెల మహిళా సాధికారత పత్రికలో ప్రచురితమైన అంశాల గురించి చర్చిస్తామని, సమావేశపు అజెండాలో దీనిని ఒక అంశంగా పెట్టుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ పత్రికను మరింత మెరుగుపరచడానికి మండల సమాఖ్యలలో ఒక కార్యక్రమం ఏర్పాటుచేసి, అభిప్రాయ సేకరణ చేస్తే బాగుంటుందని ఆమె సలహా యిచ్చారు. తమకు ఎంతో అవగాహన కలిగిస్తున్న మహిళా సాధికారత పత్రిక 10 సంవత్సరములు పూర్తి చేసుకోవడం చాలా ఆనందంగా వుందంటూ సి.సి.శాంతమ్మ సమాఖ్యలోని సభ్యులకు, సిబ్బందికి స్వీట్స్ పంచారు. ఈ కార్యక్రమంలో ఇంకా కార్యదర్శి అరుణమ్మ, సి.సి.లు మంజుల, లక్ష్మయ్య, గురుమూర్తి పాల్గొన్నారు.

### విధి నిర్వహణలో ఉపకారి

మహిళా సాధికారత ద్వారా సమాఖ్యల గురించి, అసంపూర్తి లెక్కల నిర్మాణం గురించి, స్వయం సహాయక సంఘాల పనితీరుగురించి తెలుసుకున్నానని బైరెడ్డిపల్లి మండల సమాఖ్య అకౌంటెంట్ పుష్ప తెలియజేశారు. ప్రతి నెల ఈ పత్రికను చదవడం ద్వారా కొత్త విషయాలు తెలియడంతో పాటు తన విధి నిర్వహణలో చాలా ఉపకారిగా ఉన్నదని ఆమె తెలిపారు. మహిళా సాధికారతలో ప్రచురిత మవుతున్న సూక్తులు ఎంతో మనోవికాసాన్ని కలిగిస్తున్నా యని ఆమె పేర్కొన్నారు.

***–ఎస్.ప్రహ్లాద, హేమంతకుమార్***

## జీవనాన్ని మెరుగుపరిచే పత్రిక

ఏపిమాస్ తెలుగులో ప్రచురిస్తున్న 'మహిళా సాధికారత' స్వయం సహాయక సంఘాల సభ్యుల విజయగాధలను యదార్ధంగా వివరిస్తున్నది. వివిధ 'జీవనోపాధుల గురించి, ఆర్థిక పట్టికలతో సహా విశదీకరిస్తున్నది. సమాఖ్యలలో చేపడుతున్న కార్యక్రమాల ప్రాముఖ్యతను తెల్పుతున్నది. అంతేకాకుండా 'మహిళా సాధికారత' ప్రతి పేజీ చివరన ఒక నీతివాక్యము ప్రచురించడం వలన వీటిని చదివి వ్యక్తిత్వ వికాసము పెంచుకొని, మెరుగైన జీవనవిధానము పొందుటకు అవకాశము కల్గుతున్నది. 'మహిళా సాధికారత' భవిష్యత్తులో మరింత ఎదగాలని, సంఘాల, సమాఖ్యల సభ్యుల ఔన్నత్యాన్ని చాటేందుకు దోహదపదాలని కోరుకుంటున్నాను.

***– చల్లా ఓబులేసు, కమిషనర్, గుంతకల్లు మున్సిపాలిటీ***

## మహిళల హక్కులపై అవగాహన

'మహిళా సాధికారత' మాస పత్రికలో మహిళలు: హక్కులు, మహిళల కోసం ఉన్నటువంటి చట్టాలను గూర్చి ప్రచురించడం అభినందనీయం. ప్రత్యేకంగా 'మహిళలు తెలుసుకోవలసిన ఆరోగ్య సూత్రాలు' మొదలగునవి మాకు ఎంతో ఉపయోగం. రాష్ట్రంలో వివిధ జిల్లాలలో జరిగే కార్యక్రమాలు తెలుసుకొని వెనుకబడిన అంశాలపై మేము పని చేయడానికి ఎంతో ఉపయోగకారిగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాలలో ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వివిధ రకాల జీవనోపాధి కార్యక్రమాలను, వాటికి కావలసిన బడ్జెట్ వివరాలను ప్రచురించడం ఎంతో ఉపయోగపడుతున్నది.

***–ఉమ, సిసి – ఐకెపి, పలమనేరు మండలం***

## విలువైన సమాచారం

ఎన్ పి ఎం గురించి విషయాలు చాలా బాగున్నాయి. మహిళా చేతివృత్తులు, స్వయం ఉపాధి అవకాశాల గురించి తెలియజేయడం బాగుంది. సంపాదకీయం చాలా తెలుసుకోదగినదిగా ఉంటుంది. మహిళా సాధికారత పుస్తకం ఎన్నో విలువలు గల విషయాలను తెలియజేస్తుంది. ఇలాంటి పుస్తకం మహిళకు వరం. ***– కెవి శివ్, ఎన్‌పిఎం విఏ, అనిమేటర్, కొట్టువారిపల్లి, అమడగూరు మండలం***

## హిందీలో, ఆంగ్లంలో కూడా రావాలి

ప్రియమైన కృష్ణమూర్తిగారూ,

మహిళా సాధికారత మాస పత్రిక పది వసంతములు పూర్తి చేసుకుంటున్న తరుణంలో మీకు, మన పత్రికను ఆదరిస్తున్న స్వయం సహాయక సంఘాలకు, ప్రోత్సాహక సంస్థలకు అభివాదములు. 2002వ సంవత్సరములో మొదటి పత్రిక వచ్చినప్పుడు మహిళా సంఘాలను ఉత్తేజపరిచే ఒక పత్రికగా ఆవిర్భవించిందని అందరూ భావించారు. శ్రీ నూనె శ్రీనివాసరావుగారిని గుర్తుకు తెచ్చుకోవడం ఎంతైనా ముదావహము. శ్రీ నూనె గారి తదనంతరం మీరు 'మహిళా సాధికారత' పత్రికను మీ పాత్రికేయ అనుభవముతో సరైన సమయంలో తెచ్చే ప్రయత్నం అభినందనీయం. 'మహిళా సాధికారత'లో ప్రతి నెల ఒక విషయంపై ప్రత్యేకంగా సంచిక ప్రచురించడం ముదావహము. మన పత్రికలో వస్తున్న సమాచారం ఎందరో ఎన్నో కొత్త విషయములు తెలుసు కొనుటకు తోడ్పడుతున్నది. మైనంపాటి శ్రీనివాసరావుగారి 'ఉపాధి' శీర్షిక చాలామందికి ఉపయోగకారిగా ఉన్నది.

మరీ ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్ నుండి వచ్చే సందర్శకుల వివరాలు, వారి అభిప్రాయాలు వ్రాయడం, బీహార్, ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కార్యక్రమాలకు, ఫోటో లకు సముచిత ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహిస్తున్నందుకు మీకు అభినందనములు తెలుపుతున్నాను. రాబోవు రోజుల్లో మన 'మహిళా సాధికారత' మరిన్ని విజయశిఖరాలను అందుకోవా లని, హిందీలో, ఆంగ్లంలో కూడా ప్రచురితం కావాలని, తద్వారా దేశమంతటికి వ్యాపించాలని కోరుకుంటున్నాను.

***– శ్రీ మురళి జాజున***
***ఏపిమాస్ డైరెక్టర్, బీహార్, ఉత్తరప్రదేశ్***

## స్ఫూర్తినిచ్చే అంశాలు ఎన్నో...

సూక్తులు చాలా బాగా సచ్చాయి. మహిళా సాధికారత లో కథానికలు బాగా వున్నాయి. సంపాదకీయం చాలా బాగుంది. స్ఫూర్తినిచ్చిన అంశాలు ఎన్నో మూట కట్టుకున్న మా మహిళా సాధికారతకు వందనం.

***–లక్ష్మి, ఇసి మెంబర్, కస్సముద్రం, విఏ*** ■

# బీహార్‌లో సంఘాలకు ఏపిమాస్ తోడ్పాటు !

– జి. శ్రీనివాస్

ఏపిమాస్ బీహార్ రాష్ట్ర ప్రభుత్వం డబ్ల్యు.డి.సితో 2008వ సంవత్సరంలో ఆరు బ్లాకులలో సంఘాలు, గ్రామ సంఘాల బలోపేతం కోసం ఒప్పందం చేసుకొని సాంకేతిక సహకారాన్ని అందించడం ప్రారంభించింది. రాష్ట్రంలోని డబ్ల్యు.డి.సి లో పనిచేస్తున్న 56 బ్లాక్ సమాఖ్యల సిబ్బందికి, సభ్యులకు, సంఘ, సమాఖ్య ప్రతినిధులకు శిక్షణలను, క్షేత్ర సందర్శనలను ఏపిమాస్ ఏర్పాటు చేసింది. బీహార్‌లో సంఘాలను ఏర్పాటుచేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు నాబార్డు వారి సహకారంతో వివిధ రకాల శిక్షణకు సంబంధించిన పుస్తకాలను రూపొందించి, వారి సిబ్బందికి, సంఘాల సభ్యులకు, ప్రతినిధులకు శిక్షణ చేయటం జరిగినది.

2011వ సంవత్సరంలో 500 మహిళా సంఘాలను ఏర్పాటు, బలోపేతం కోసం నాబార్డు వారితో రెండు బ్లాకులలో, మూడు సంవత్సరాల కోసం ఒప్పందం చేసుకొని పని ప్రారంభించటం జరిగినది. మరియు 2012 వ సంవత్సరంలో నాలుగు బ్లాకులలో నాలుగు స్వచ్ఛంద సంస్థల ద్వారా 4000 సంఘాలు ఏర్పాటు, మూడు సంవత్సరాలలో బలోపేతం చేయటం కోసం, నాబార్డు వారితో మరియొక ఒప్పందం చేసుకొని కార్యక్రమాలను పెంచటం జరిగింది.

మూడు సంవత్సరాలు పూర్తి అయ్యాకా, నాబార్డు వారి ఒప్పందం విరమణ అనంతరం బీహార్ రాష్ట్రంలో సంఘాలు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ సంస్థ ఐన బి.ఆర్.యల్.పి.యస్ వారి ప్రోద్బలంతో, ఇ.అండ్ వై ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో, ముందుగా చేస్తున్న నాలుగు బ్లాకులలోని రెండు బ్లాకులైన సారాన్ జిల్లాలోని దిగ్వారా, ఘరాలలో పనులను కొనసాగించే ప్రక్రియ కొనసాగించడం జరిగింది.

మొదట ఇ.అండ్ వై ఫౌండేషన్ వారితో 2015 నుండి 2018 కోసం మూడు సంవత్సారాల ఒప్పందం చేసుకొని బి.ఆర్.యల్.పి.యస్ వారితో కలిసి సంఘాల ఏర్పాటు, బలోపేతం కోసం పని చేయటం జరిగింది. ఈ బృహత్తర కార్యక్రమలో భాగంగా ఏర్పాటు చేయబడిన సంఘాలను బలోపేతం చేయటం, నూతన సంఘాలను ఏర్పాటు చేయటం, ఏర్పాటైన సంఘాలతో గ్రామ సంఘాలను ఏర్పాటు చేయటం, ఏర్పాటైన గ్రామ సంఘాలతో క్లస్టర్ సమాఖ్యలను ఏర్పాటు చేయటం మరియు ఏర్పాటు చేసిన సంఘాలకు బ్యాంకుల నుండి అప్పులు ఇప్పించటం, సంఘాలకు, సమాఖ్యలకు, సిబ్బందికి వివిధ రకాలైన శిక్షణలు ఇవ్వటం, క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేయటం అను ఉద్దేశ్యంతో కార్యక్రమాల అమలు ప్రారంభించి, వార్షిక ప్రణాళికలు తయారుచేసి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

**ఇట్టి మూడు సంవత్సరాలలో చేపట్టిన కార్యక్రమాలు:**

- 18743 మంది సభ్యులతో 1600 మహిళా సఘాలు ఏర్పాటు చేయటం జరిగింది.
- 110 గ్రామ సంఘాలు ఏర్పాటు చేయటం జరిగింది.
- 1123 సంఘాలకు బ్యాంకు ఖాతాలు తెరవటం జరిగింది.
- 365 సంఘాలకు బి. ఆర్.యల్.పి.యస్ వారి ద్వారా రివాల్వింగ్ ఫండ్ అందించటం జరిగింది.
- 504 సంఘాలకు బ్యాంకు నుండి రుణాలు ఇప్పించటం జరిగింది.
- 87 గ్రామ సంఘాల బ్యాంకు ఖాతా తెరవటం
- 87 గ్రామ సంఘాలకు బి.ఆర్.యల్.పి.యస్ వారి నుండి ఐ.సి.యఫ్ మరియు హెచ్.ఆర్.యఫ్ కోసం దరఖాస్తు చేయించటం మరియు ఇప్పించటం జరిగింది.
- తెలంగాణ రాష్ట్రం నుండి సి.ఆర్.పి లను పంపించి వారిద్వారా సంఘాలు, గ్రామ సంఘాల ఏర్పాటు చేయించి, వారికి శిక్షణలు ఇప్పించటం జరిగింది.
- సంఘాలలో పొదుపు పెంపుదల చేయించటం

- గ్రామ సంఘాలలో కార్యకర్తలను ఏర్పాటు చేసి వారికి శిక్షణలు, క్షేత్ర సందర్శనలు ఏర్పాటు
- గ్రామ సంఘాలలో వివిధ రకాలైన ఉప కమిటీలను ఏర్పాటుచేసి వాటికి శిక్షణలు ఇవ్వటం జరిగింది.
- పుస్తక నిర్వహణ, ఆడిట్ తదితర కార్యక్రమాల అమలు చేయటం జరిగింది.
- శిక్షణకు సంబందించిన పోస్టర్లు, సామాగ్రి, పుస్తకాలు, విడియో తయారు చేయటం జరిగింది.

పైన పేర్కొన్న విధంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్నాక ఇ.అండ్ వై ఫౌండేషన్ వారు 2018 నుండి 2021 వరకు, మళ్ళీ మూడు సంవత్సరాల కోసం ఆర్థిక సహకారం అందించటానికి ఒప్పందం చేసుకోవటం జరిగింది. 2021 నుండి 2022వరకు కూడా ఒక సంవత్సరం కాలం తిరిగి ఒప్పందం గడువు పెంచటం జరిగింది. ఇట్టి ఒప్పందం యొక్క ముఖ్య ఉద్దేశ్యం: ఏర్పాటు చేసిన సంఘాలు, గ్రామ సంఘాలను స్వయం ప్రతిపత్తి గల సంఘాలుగా చేయటం, సంఘాలలోని, గ్రామ సంఘాలలోని సభ్యులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడటం, సంఘాలలోని, గ్రామ సంఘాలలోని సభ్యుల జీవన విధానాలలో మార్పులకోసం జీవనోపాధి కార్యక్రమాలు అమలు, ఆరోగ్యం మరియు సామాజిక అంశాలలో సభ్యులకు తోడ్పాటు, దీనితో పాటుగా స్వయం నియత్రణ ఉద్యమం కార్యక్రమాల అమలు చేయటం మొదలగునవి.

**ఏర్పాటు చేసుకున్న ఉద్దేశ్యం ప్రకారం ఈ క్రింది కార్యక్రమాలు చేయటం జరిగింది**

- జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా మెరుగైన వ్యవసాయ విధానం కొరకు సాంకేతిక సహకారం కోసం ప్రాన్ సంస్థతో ఒప్పందం చేసుకోవటం జరిగింది.
- గ్రామ సంఘాల కార్యకర్తలకు పుస్తక నిర్వహణ, ఆడిట్ తదితర అంశాలపై శిక్షణ చేయటం జరిగింది మరియు వారి పనితీరు నిరంతరం పర్యవేక్షించటం.
- జీవనోపాధి కార్యక్రమాలపై ఇ.అండ్ వై ఫౌండేషన్ వారి ద్వారా ఒక కార్యశాల నిర్వహించనైనది.
- గ్రామ సంఘాల బలోపేతం కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలతో పాటుగా జీవనోపాధి కమిటీని కుడా ఏర్పాటు చేసి వారికి మిగతా కమిటీలకు శిక్షణ ఇచ్చిన మాదిరిగా ఈ కమిటికి కూడా శిక్షణ ఇచ్చి కమిటి ద్వారా దాదాపు 12000 మంది ఆయా గ్రామ సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి వారి కుటుంబ ఆదాయం పెంపుదలకు కృషి చేయటం జరిగింది. విత్తన శుద్ధి, సేంద్రియ ఎరువుల తయారు తదితర అంశాలు చేపట్టడం జరిగింది.
- సంఘాలు, సమాఖ్య సభ్యుల కొరకు ఆరోగ్యం, సామజిక అంశాలపై ఉపకమిటీలను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చి ఎప్పటికప్పుడు పర్యవేక్షించటం
- ఆధునిక వ్యవసాయ పద్ధతులపై సమాఖ్య సిబ్బంది అయిన కార్యకర్తలు, వి.ఆర్.పిలకు శిక్షణ ఇచ్చి వారిద్వారా సంఘ సభ్యులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించనైనది.
- సంఘాల, గ్రామ సంఘాల నిర్వహణ కోసం సభ్యులకు, లీడర్లకు, ప్రాజెక్ట్ సిబ్బందికి శిక్షణ ఇవ్వటం జరిగింది.
- సంఘాల, గ్రామ సంఘాల నిర్వహణ కోసం సభ్యులకు, లిడర్లకు, ప్రాజెక్ట్ సిబ్బందికి క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేయటం జరిగింది.
- ప్రాజెక్ట్ నుండి, బ్యాంకు నుండి అప్పులు ఇప్పించటం, తిరిగి చెల్లింపు చేసే ప్రక్రియని బలోపేతం చేయటం జరిగింది.
- తెలంగాణా రాష్ట్రం నుండి సి.ఆర్.పి లను పంపించి వారిద్వారా గ్రామ సంఘాల బలోపేతం కోసం గ్రామ సంఘాల ఉప కమిటిలకు, పదాదికారులకు, సిబ్బందికి శిక్షణ
- బి.ఆర్.యల్.పి.యస్, ఇ.అండ్ వై ఫౌండేషన్ వారితో కలిసి ఫీల్డ్ విజిట్ చేసి, త్రైమాసిక సమీక్ష సమావేశాలు నిర్వహించటం జరిగింది.
- గ్రామ సంఘాలతో కలిపి రెండు బ్లాక్‌లలో మొత్తం ఐదు క్లస్టర్ స్థాయి సమాఖ్య ఏర్పాటు చేయటం జరిగింది. మరియు సమాఖ్య బలోపేతం కోసం వార్షిక

ప్రణాళికలు తయారు చేయించి ప్రణాళిక ద్వారా కార్యక్రమాలు అమలు కోసం పని చేయటం జరుగుతున్నది.

- 2015 నుండి 2022 వరకు జరిగిన ప్రగతి: 1771 స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయటం, 126 గ్రామ సంఘాలను ఏర్పాటు చేయటం, 05 క్లస్టర్ స్థాయి సమాఖ్యలను ఏర్పాటు చేయటం జరిగింది.
- అన్ని సంఘాలకు, గ్రామ సంఘాలకు బ్యాంక్ ఖాతా తెరిపించటం మరియు వారికి అప్పులు అందించటం
- దాదాపు 11298 మంది కుటుంబాలతో వ్యవసాయ కార్యక్రమాలు చేపట్టడం
- 8955 మంది కుటుంబాలతో వ్యవసాయేతర కార్యక్రమాలు చేపట్టడం
- 8617 మంది కుటుంబాలతో పెద్ద పశు సంపద పైన పని చేయటం, మరియు 3871 చిన్న పశు సంపద పైన పని చేయటం జరిగింది.
- 6737 మంది కుటుంబాలతో పెరటి తోటలు పెంపకం చేయించటం జరిగింది.

పైన పేర్కొన్న కార్యక్రమాలతో పాటు సెర్ప్ ఆంధ్ర ప్రదేశ్ సహకారంతో బి.ఆర్.యల్.పి.యస్ వారితో రాష్ట్ర స్థాయిలో శిక్షణలు, క్షేత్ర సందర్శనలు, కార్యశాలలు నిర్వహించటం జరిగింది. మరియు సంఘాలకు, గ్రామ సంఘాలకు, క్లస్టర్ స్థాయి సమాఖ్యలకు శిక్షణ ఇవ్వటానికి సంబందిత మాడ్యుల్‌లను తయారు చేయటం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ నుండి సి.ఆర్.పి లను బీహార్ రాష్ట్రానికి మూడు సంవత్సరాలుగా ఎనిమిది పర్యాయలుగా పంపించి క్లస్టర్ స్థాయి సమాఖ్యలకు, గ్రామ సంఘాలను ఏర్పాటు చేయించటం మరియు వాటి బలోపేతంపై పని చేయటం జరిగింది. బీహార్‌లో గ్రామీణ స్థాయిలోనే కాకుండా స్పార్ ప్రాజెక్ట్‌లో భాగంగా పట్టణ స్థాయి సంస్థల ఏర్పాటు, బలోపేతం కోసం ఆరు జిల్లాలో మూడు సంవత్సరాల పాటుగా ఒక చక్కని బృహత్తరమైన కార్యక్రమాన్ని బీహార్ ప్రభుత్వంతో కలిసి చేయటం జరిగింది.

బి.ఆర్.యల్.పి.యస్ వారితో ఆర్థికేతర ఒప్పందం ఏర్పాటు చేసుకొని స్వయం నియంత్రణ ఉద్యమం కార్యక్రమాలు అమలు పరచటం కోసం మూడు జిల్లాలలో ఐదు సంవత్సరాలుగా పని చేయటం జరుగుతున్నది. ఇట్టి కార్యక్రమం ఇప్పుడు కొనసాగుతూనే ఉంది. మరియు రెండవ దఫా బి.ఆర్.యల్.పి.యస్ వారితో ఆర్థికేతర ఒప్పందం ఏర్పాటు చేసుకొని 29 ఆదర్శ క్లస్టర్ స్థాయి సమాఖ్యల కోసం పనిని మొదలు పెట్టడం జరిగింది. అది ఇప్పడు కొనసాగు తున్నది. మరియు రాష్ట్ర స్థాయి కెపాసిటీ బిల్డింగ్, సాంకేతిక సహకారం కొనసాగుతున్నది.

బీహార్ రాష్ట్రంలో మహిళా సఘాలు, సమాఖ్యల కోసం పని చేయటమే కాకుండా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా ఏర్పాటు చేయటం జరుగుతున్నది. సెంట్రల్ సెక్టార్ స్కీం క్రింద ఏపిమాస్ సి.బి.బి.ఓ గా బీహార్ రాష్ట్రంలో నాబార్డు వారి సహకారంతో ఐదు, యన్.సి.డి.సి సహకారంతో ఆరు మొత్తం పదకొండు రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయటం జరిగింది. అట్టి కార్యక్రమం కొనసాగుతున్నది. 2008వ సంవత్సరంలో మొదలైన ప్రస్థానం అంచె లంచెలుగా ఎదుగుతూ బీహార్ రాష్ట్రంలో పేదరికనిర్మూలనకు ఏపిమాస్ ఇతర సంస్థలను కలుపుకోనిపోతూ, తనదైన శైలిని ప్రదర్శిస్తూ కార్యక్రమాల అమలు, సంస్థల బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంది. ఇట్టి కార్యక్రమాలను నిర్వహించటానికి కావాల్సిన సాంకేతిక, ఆర్థిక సహకరారం అందించిన వివిధ దాతలు, భాగస్వాములకు ఏపిమాస్ తరపున ప్రత్యేక ధన్యవాదములు.

ఇట్టి కార్యక్రమాలు సజావుగా సాగటానికి మంచి నాయకత్వం వహిస్తూ ముందుకు నడిపించిన నాయకుడు శ్రీ.సి యస్.రెడ్డి గారు, సహకారం అందించిన నాయకుడు శ్రీ మధుమూర్తి గారు, మార్గదర్శకత్వం వహించిన నాయకురాలు శ్రీమతి రామలక్ష్మి గారు మరియు బీహార్‌లో గతంలో పని చేసిన సిబ్బంది, ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది అందరి కార్యదీక్ష కృషి, పట్టుదల ఎంతైనా ఉంది. అందరికి పేరు పేరున ధన్యవాదములు. ఇట్టి కార్యక్రమము విజయవంతం అవ్వటంలో నేను కూడా ఒక భాగస్వామిగా ఉన్నందుకు నాకు ఎంతో గర్వంగా ఉంది. ■

విజ్ఞానాన్ని మించిన ఆయుధం లేదు, వివేకాన్ని మించిన సాధనం లేదు

# 'అనంత'లో ఉత్సాహంగా పర్యావరణ దినోత్సవం

-అనిత

అనంతపురంలోని 'ఏ.ఎఫ్. ఎకాలజి సెంటర్'లో 05-06-22వ తేదీనాడు 'ప్రపంచ పర్యావరణ దినో త్సవాన్ని' ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ శ్రీమతి గిరిజ, జిల్లా అటవీ శాఖాధికారి శ్రీ.చంద్రశేఖర్, జిల్లా అదనపు పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ హనుమంతు, ఏ.ఎఫ్. ఎకాలజి సెంటర్ డైరెక్టర్ శ్రీ మల్లారెడ్డి, రెడ్స్ డైరెక్టర్ శ్రీమతి భానుజ, జిల్లా ఇతర అధికారులు, అనంత గ్రామీణ మహిళా రైతుసంఘం సభ్యులు, భూమాత మహిళా రైతుసంఘం సభ్యులు, రెడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ముందుగా శ్రీ మల్లారెడ్డి మాట్లాడుతూ, కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో కోటి మొక్కలు నాటాలని, ముందుకు వచ్చిన శ్రీజి ప్రకృతి ధర్మపీటం ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రస్తుత కాలుష్య పూరిత వాతా వరణాన్ని ఎదుర్కోవాలన్నా, వర్షాలు సమృద్ధిగా కురవాలన్నా చెట్లను విరివిగా పెంచాలని చెప్పారు. చెట్లను నరకడం వల్ల భూతాపం ఏర్పడుతుందని, భూతాపం వల్ల మానవ మనుగడకే ముప్పు వస్తుందని ఆయన వివరించారు.

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ శ్రీమతి గిరిజ మాట్లాడుతూ ప్రపంచాన్ని కలవరపెడుతున్న పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందని, అనంతపురం జిల్లాను 'అనంతకోటి వృక్ష వనం'గా చేద్దామని పిలుపునిచ్చారు.

జిల్లా అటవీ శాఖాధికారి శ్రీ చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవడం మన అందరి బాధ్యత అని, 'వృక్షో రక్షతి రక్షితః ' అనే సూక్తికి అనుగుణంగా ప్రతి రైతు తమ పొలాల గట్ల మీద వేప, కానుగ మొక్కలను నాటాలని కోరారు. మొక్కలను ప్రభుత్వం ఉచితంగా ఆయా గ్రామాల పరిధిలోని నర్సరీలలో పంపిణి చేస్తుందని తెలిపారు.

జిల్లా అదనపు పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ హనుమంతు మాట్లాడుతూ 'నేను ప్రకృతి ప్రేమికుణ్ణి. నేను చెట్ల వల్ల చాలా విషయాలు తెలుసుకొన్నాను. చెట్టులోని ప్రతి భాగం మనకు ఉపయోగపడుతుంది. కొన్నింటిని పూజిస్తాము,కొన్నింటితో సేద తీరుతాము, కొన్ని చెట్లతో సంతోషాన్ని పొందుతాము, కొన్ని చెట్లు ఔషధాలుగా కూడా ఉపయోగపడతాయి. ఇలా చెట్లు మనకు మంచే కానీ చెడు చేయవు' అన్నారు.

రెడ్స్ డైరెక్టర్ భానుజ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక చెట్టు నాటితే ... దేశంలోని 130 కోట్ల జనాభా నాటినట్లయితే ఇప్పుడున్న మొక్కలతోపాటు 130 కోట్ల మొక్కలు అదనంగా పెంచిన వారమవుతామన్నారు. రెడ్స్ సంస్థ ద్వారా ఈ సంవత్సరం 27,000 ఔషధమొక్కలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని" ఆమె తెలిపారు. వ్యవసాయంలో విత్తనం నాటే దగ్గర నుండి పంట కోత వరకు మహిళలే ఎక్కువగా పని చేస్తుంటారని, కాని వీరికి రైతుగా గుర్తింపు రావడం లేదని, మహిళా రైతులకు గుర్తింపుతో పాటు ప్రాధాన్యం కూడా ఇవ్వాలని, ఈ విషయాలపై మహిళా రైతుల సంతకాలతో ఒక నివేదిక తయారుచేసి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి గిరిజ గారికి అందజేసినట్టు ఆమె వివరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా రైతు సంఘాల సభ్యులైన మహిళా రైతులు మాట్లాడుతూ... "చెట్లతోనే మేము సహజీవనం సాగిస్తున్నాము. ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకొనే వరకు మేము మొక్కలతో, చెట్లతోనే గడుపుతాము. వాటిని దైవసమానంగా పూజిస్తాము. అవి లేకపోతే మా జీవితమే కాదు మానవాళి మనుగడే లేదు" అని చెప్పారు.

"చెట్టమ్మ చెట్టమ్మ పచ్చాని చెట్టమ్మ" అని వారు పాడిన పాటతో కార్యక్రమం ముగిసింది. ■

# ఆదర్శ సమాఖ్యలకు ఏపిమాస్ జాతీయ స్థాయి శిక్షణ

- జి.శ్రీనివాస్

**జా**తీయస్థాయిలోని ఆదర్శ స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు 31-05-2022 వ తేదీ నుండి 04-06-2022 వరకు ఐదు రోజుల పాటు ఏపిమాస్ ఆధ్వర్యంలో, డి.జి.ఆర్.వి వారి ఆర్థిక సహకారంతో హైదరాబాదులోని ఏపిమాస్ శిక్షణ కేంద్రంలో శిక్షణను నిర్వహించారు. ఈ శిక్షణకు ఐదు రాష్ట్రాలకు చెందిన ఎనిమిది స్వచ్ఛంద సంస్థల నుండి 24 మంది అభ్యాసకులు పాల్గొన్నారు. ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో నాలుగు రోజులపాటు శిక్షణ, కామారెడ్డి జిల్లాలో ఒకరోజు క్షేత్ర సందర్శన ఏర్పాటు చేయటం జరిగింది.

శిక్షణ ప్రారంభం కార్యక్రమంలో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.యస్.రెడ్డి ంపాల్గొని భారతదేశంలోని మహిళా సంఘాలు, సమాఖ్యల స్థితి గతులను గురించి, జాతీయ స్థాయిలో సమాఖ్యల విజన్ 2030 గురించి వివరించారు.

ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ యన్.మధుమూర్తి గారు ఏపిమాస్ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. అభ్యాసకుల ద్వారా వారి వారి అనుభవాలను చెప్పించారు. అభ్యాసకులు వారి సంస్థలలో సంఘాలు, సమాఖ్యల కోసం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.

ఈ శిక్షణలో సమాఖ్య అంటే ఏమిటో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో సంఘాల, సమాఖ్యల ఏర్పాటు విధానం, సమావేశాల నిర్వహణ తీరు గురించి, సంఘాలు, సమాఖ్యలు పాటించాల్సిన సహకార సూత్రాలు, పద్దతులు, సహకార విలువల గురించి అవగాహన కలిగించారు.

రెండవ రోజున సమాఖ్యల నిర్మాణం, సమాఖ్యలోని మహాసభ, పాలకవర్గం, పదాధికారులు మొదలైన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

ఆదర్శ సమాఖ్యల గురించి వివరించి , ఆదర్శ సమాఖ్య కోసం ఏవిధంగా పని చేయాలో తెలియచేయటం జరిగింది. వాష్ కార్యక్రమాల అమలు, పాటించవలసిన వ్యక్తిగత, సంస్థాగత పరిశుభ్రత గురించి కూడా వివరించారు. స్వయం నియత్రణ ఉద్యమం గురించి, వివరించటం జరిగింది. నాయకత్వం, బాధ్యతల గురించి, ఎన్నికలు నిర్వహించే విధానం గురించి , శ్రీనిధి కో-ఆపరేటివ్ బ్యాంకు నిర్వహణ విధానం,కార్యక్రమాలు, సభ్యులు పాటించవలసిన విధి విధానాల గురించి వివరించడం జరిగింది.

శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఒకరోజు క్షేత్ర సందర్శన కోసం కామారెడ్డి జిల్లాలోని బికనూర్ మండలంలోని సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య సభ్యులు, ప్రతినిధులతో సమావేశమై సంఘాలు, సమాఖ్యల నిర్వహణ విధానంపై నేరుగా సభ్యులతో మాట్లాడి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవటం జరిగింది. మరియు కామారెడ్డి జిల్లా కలెక్టర్ గారితో, డి.ఆర్.డి.ఓ గారితో, ఏ.పి.డి గార్లతో సమావేశం అవ్వటం జరిగింది.

అభ్యాసకులు క్షేత్ర సందర్శనలో నేర్చుకున్న విషయాలపై చర్చించి అన్ని సందేహాలు నివృత్తి చేయటం జరిగింది. మరియు జీవనోపాధి కార్యక్రమాలు విధి విధానాలు, సంఘాలలో అమలు గురించి తెలియ పరచటం జరిగింది. చివరకు ఒక చక్కని ప్రణాళిక తయారు చేయించటం జరిగింది. ఈ విధంగా ఐదు రోజుల పాటు జరిగిన శిక్షణలో అభ్యాసకులు మాట్లాడుతూ కనీవిని ఎరుగని రీతిలో శిక్షణ జరిగినదని శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్‌లకు మరియు శిక్షణ ఏర్పాటు చేసిన ఏపిమాస్ వారికి ప్రత్యేక ధన్యవాదములు తెల్పినారు.

ఇట్టి శిక్షణలో రిసోర్స్ పర్సన్‌లుగా శ్రీ సి.యస్ రెడ్డిగారు, శ్రీ యన్.మధుమూర్తి గారు, శ్రీమతి యస్.రామలక్ష్మి గారు, శ్రీ మురళి జాజున గారు, సెర్ప్ నుండి శ్రీ రవీందర్ గారు, శ్రీ కర్రి శ్రీనివాస్ గారు, శ్రీమతి భవాని గారు, మరియు శిక్షణ కో-ఆర్డినేటర్లు శ్రీ జి శ్రీనివాస్ గారు, శ్రీమతి అనూష గార్లు పాల్గొని వివిధ అంశాలపై అభ్యాసకులకు వివరించారు. ■

# 'మహిళా సాధికారత ' అందరికీ ఉపయోగపడే అరుదైన పత్రిక!

(15 వ పేజీ తరువాయి ...)

చాలా స్వల్పం. వాటిలో 20 ఏళ్ళుగా నిరాఘాటంగా పత్రిక నిర్వహించేవి యింకా తక్కువ. ఆ అరుదైన ఘనత ఏపిమాస్ సొంతం!

**రాజశేఖర్:** ఏపిమాస్ సారథిగా, మహిళా సాధికారత పత్రిక సంపాదకునిగా, రెండు దశాబ్దాలకు పైగా అభివృద్ధి రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తిగా ఆశించిన మహిళా సాధికారత ఈ ఇరవై ఏళ్ళలో ఏ మేరకు ఫలించిందంటారు?

**సి ఎస్ రెడ్డి :** మహిళలకు సాధికారత సాధన అనేది ఒక నిరంతర ప్రయాణం లాంటిది. సంపూర్ణంగా ఫలించింది అనేది ఏదీ వుండకపోవచ్చు. మహిళా సాధికారత పత్రిక గమ్యం దిశగా ముందుకు సాగడానికి తోడ్పడే ఒక సాధనం మాత్రమే. ఐతే ప్రగతి పథంలో మున్ముందుకు సాగడంపైనే మొత్తందృష్టి కేంద్రీకృతమైంది. మహిళా సంఘాలను బలోపేతం చేయడంజరిగింది.స్వయంసహాయ మహిళలకు యిప్పుడు డబ్బు వుంది, నిర్ణయాత్మకమైన పాత్ర పోషించగలుగుతున్నారు. కాని వాళ్ళ పరిస్థితి పూర్తిగా బాగుపడిందని చెప్పలేం. ఎందుకంటే సామాజికంగా వారు పూర్తి సాధికారత సాధించాలంటే, ఆ మార్పు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రీయ,ప్రాంతీయ స్థాయిలన్నిటిలో రావాలి. అందువల్ల మహిళా సాధికారత సాధనకు అడ్డంకులన్నీ తొలగిపోయాయని చెప్పలేం.

సంపూర్ణ మహిళా సాధికారత సాధించాలంటే ...సమాజంలో, స్త్రీ పురుషుల ఆలోచనా ధోరణిలో మార్పు రావాలి. ఇందుకు యింకా కనీసం వంద సంవత్సరాలైనా పట్టవచ్చు. కాని ఈ లోగా మహిళా సాధికారత పత్రిక ద్వారా మహిళా సంఘాలను సుస్థిరాభివృద్ధి సాధన దిశగా బలోపేతం చేయడంలో ఏపిమాస్ విజయవంతమైంది.నాయకత్వంపైన, సమావేశాల నిర్వహణపైన, అధికారులతో, ఎన్‌జిఓలతో, ఇతర భాగస్వాములతో మాట్లాడడంపైన, వారి హక్కుల సంరక్షణ పైన, సాధికారత సాధించడంపైన వారిలో అవగాహన పెంచి, కార్యోన్ముఖులను చేయడంలో మహిళా సాధికారత పత్రిక కీలక భూమికను పోషించిది. నేను ఎక్కడికి వెళ్ళినా మహిళా సాధికారత పత్రికను నా వెంట వుంచుకుంటాను. స్నేహితులకు, శ్రేయోభిలాషులకు, యితరులకు యిస్తుంటాను, ఈ పత్రిక త్వరలోనే ' డిజిటల్ రూపంలో రానున్నది. ■

## 'మహిళా సాధికారత' మాకెంతో ఉపయోగపడుతున్నది: పాఠకుల మనోగతం !

మహిళా సాధికారత పత్రిక ద్విదశాబ్ది ఉత్సవాల సందర్భంగా, పత్రికపై పాఠకుల అభిప్రాయాలను తెలుసుకోవాలని ఒక చిన్న ప్రయత్నం జరిగింది. చిత్తూరు, అనంతపురం జిల్లాలలో, తెలంగాణాలోని సదాశివనగర్ లో కొద్దిమంది పాఠకులను ప్రశ్నించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మొత్తం 27 మంది తమ అభిప్రాయాలను తెలిపారు. ఆ వివరాలను వారి మాటలలోనే చూద్దాం ...

- మహిళా సాధికారత పత్రిక ప్రతినెలా మాకు అందుతున్నది. మాలో కొందరికి పోస్ట్ ద్వారా అందితే, మరి కొందరికి ఏపిమాస్ సిబ్బంది అందజేస్తున్నారు.
- మేమంతా మహిళా సాధికారత పత్రికను అత్యంత ఆసక్తితో చదువుతాం
- ఈ పత్రికలో ప్రచురించే విజయగాథలు, క్షేత్రస్థాయి కథనాలు, ఎస్ హెచ్ జిలు, ఎఫ్ పి ఓల వ్యాపార విశేషాలు, పోషకాహార వివరాలు, ప్రభుత్వ పథకాలు, సాధికార మహిళల సాహసాలు, రైతుల అనుభవాలు, పెరటి తోటల పెంపకం విశేషాలు మొదలైనవి మాకెంతో ఆసక్తిగా, ఉపయోగంగా వున్నాయి.
- మహిళా వ్యాపార, పారిశ్రామిక వేత్తలపైన, పంటల తీరుతెన్నులపైన, ప్రభుత్వ కార్యక్రమాలపైన, పథకాలపైన నాయకత్వ మహిళల పైన మరిన్ని కథనాలు వస్తే యింకా బాగుంటుంది. ■

# సభ్యులకు లాభాలు పంచిన హసనపర్తి ఎఫ్ పి సి

- ధారా సురేందర్, సి ఇ ఓ, హసనపర్తి ఎఫ్ పి సి

**మే**ము అనగా వరంగల్ జిల్లా హసనపర్తి మండలం లోని ఐదు గ్రామాల నుండి గ్రామానికి ఇద్దరు చొప్పున పదిమంది ప్రమోటర్స్‌తో నాబార్డ్ సహకారంతో పోతన ఎన్జీవో ఆధ్వర్యంలో హసనపర్తి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను 2018 నాడు రిజిస్టర్ చేఉకున్నాము. దాదాపు 500 మంది రైతు సభ్యుల నుండి 5 లక్షలు వాటాధనము సేకరించబడినది. ఈ వాటాధనము ద్వారా ఏదైనా సభ్యులకు ఉపయోగపడే వ్యాపారము చేయాలి అని డైరెక్టర్స్ మరియు ప్రోత్సాహక సంస్థ అయిన పోతన ఎన్జీవో మధ్య చర్చ జరిగింది. ఈ చర్చలో అందరి ఆమోదంతో ఇన్ పుట్షాప్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేయడం జరిగింది మరియు దీనికి కావాల్సిన లైసెన్సులు తీసుకోవడం జరిగింది. ఈవిధంగా ప్రతి సంవత్సరము సరాసరిన మా ఎఫ్ పి సి బిజినెస్ 10 లక్షలు దాకా ఉంది. దీని తర్వాత ఏపీమాస్ ఆధ్వర్యంలో డైరెక్టర్లకు, ఎఫ్‌పిసి సీఈఓల శిక్షణా కార్యక్రమములో ఇన్ పుట్, ఔట్ పుట్ వ్యాపారము గురించి, వివిధ బిజినెస్ సలహాలు సూచనలు చెప్పడం జరిగింది. ఈ శిక్షణ అనుభవంతో ఇన్‌పుట్ బిజినెస్ మాత్రమే కాదు ఔట్‌పుట్ బిజినెస్ అవకాశాలు బాగా ఉన్నాయి అని తెలియవచ్చింది.

అంతేకాకుండా ఎఫ్‌పిసికి, సభ్యులకు లాభాలు రావాలన్నా, సంస్థ సుస్థిరాభివృద్ధితో ఎదగాలన్నా ఔట్‌పుట్ బిజినెస్ ఎంతో ముఖ్యము అని గ్రహించినాము. అయితే మా దగ్గర ఎక్కువ శాతం అనగా 70% శాతం వరి ఉంటుంది, మరియు తెలంగాణ గవర్నమెంటు వరి వేయొద్దు అని చెప్పడం జరిగింది. ఇలాంటి పరిస్థితిలో ఈసారి ఎలాగైనా మా ఎఫ్ పి సి సభ్యులు నష్టపోవద్దు అనే కృతనిశ్చయముతో వివిధ విత్తన కంపెనీలతో కలవడం జరిగింది. ఇందులో భాగంగా ఒక కంపెనీ అయినా అభిమన్యు సీడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, ఉత్తరప్రదేశ్ వారితో చర్చలు జరిపి దాదాపు 600 ఎకరాలు అనగా మూడు వందల మంది రైతులను ఒప్పించి హసనపర్తి ఎఫ్ పి సి, అభిమన్యు సీడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఒప్పందము చేయడము జరిగింది.

ఒప్పందములో భాగంగా కంపెని ద్వారా పూస బాస్మతి1509 రకము, ఫౌండేషన్ సీడ్స్ సభ్యులకు ఇప్పించడం, రవాణా బాధ్యత కంపెనీదే. సభ్యుల నుండి పంట ఉత్పత్తి సేకరించడం ఎఫ్ పి సి బాధ్యత. మా కంపెనీలో అనుభవజ్ఞుడైన డైరెక్టర్ అయిన పోతబోయిన రవీందర్, పోతన ఎన్జీవో సెక్రెటరీ శ్రీ వెంకట్ రెడ్డి, ఏపీమాస్ ప్రతినిధి శ్రీ గంగాధర్ సలహాలతో పూస బాస్మతి-1509 వరి వేయడం జరిగింది. దాదాపు ఎకరాకు 25 క్వింటాళ్ల వరి దిగుబడి వచ్చినది. ఒప్పందము ప్రకారము ఎఫ్‌పిసి పంట ఉత్పత్తి సేకరించడము కోసము మా డైరెక్టర్లు చర్చించి సేకరణకు కావలసిన కనీస అవసరాల కోసం (హమాలి, రావాణా, బారదాన్‌లు, తూనిక మిషన్స్ మొదలైనవి), పెట్టుబడి కోసం సమున్నతి వారి ద్వారా ఐదు లక్షల రూపాయలు అప్పు తీసుకోవడం జరిగింది.

తరువాత 300 మంది రైతుల దగ్గర నుండి ప్రతి క్వింటాకు 2400 రూపాయల చొప్పున 6500 క్వింటాళ్లను రైతుల నుండి సేకరించి అభిమన్యు సీడ్ కంపెనీకి పంపడం జరిగింది. ఒక క్వింటాల్ కంపెనీతో 2400 రూపాయలు అని ధర ముందే నిర్ణయించడము జరిగింది. ఇందులో రైతుకు ప్రతి క్వింటాకు 2300 రూపాయలు ఇచ్చేటట్లు, 100 రూపాయలు సేకరణ ఖర్చు క్రింద ఎఫ్ పి సి కు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకోవడం జరిగింది. అనగామా ఎఫ్ పి సి ద్వారా 6500 2400 = 1,56,00,000 కోటి యాభై ఆరు లక్షల బిజినెస్ చేయడం జరిగింది. ఇప్పటివరకూ రైతులకు 60 లక్షల పేమెంటు చేయడం జరిగింది. ఇంకా మిగతా పేమెంట్ ఒప్పందము

# సహజీవనం వివాహంతో సమానం: సుప్రీంకోర్టు

సహజీవనంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సహజీవనం చేస్తే పెళ్లి చేసుకున్నట్లేనని, సహజీవన బంధాన్ని వివాహంగానే పరిగణిస్తామని సుప్రీం మంగళవారం పేర్కొంది. అంతే కాకుండా సహజీవనంలో కలిగే పిల్లలకు పూర్వీకుల ఆస్తిలో వాటా ఉంటుందని పేర్కొంది. 2009లో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం తాజాగా కొట్టే వేస్తూ ఈ తీర్పు వెలువరించింది. చాలా ఏళ్లపాటు పెళ్లికి, సహజీవనానికి చట్టం ఒకే విధంగా లేదని సుప్రీంకోర్టు గుర్తు చేసింది.

కేరళలోని ఎర్నాకులంకు చెందిన ఒక జంట సుదీర్ఘకాలం పాటు సహజీవనం చేసింది. కాగా, వారికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ జంట పెళ్లి చేసుకున్నట్లు సాక్ష్యాలు లేని కారణంగా, ఆ కుమారుడిని అక్రమ సంతానంగా భావిస్తూ, పూర్వీకుల ఆస్తిలో వాటా దక్కదని 2009లో కేరళ హైకోర్టు తీర్పు చెప్పింది. కాగా, కేరళ హైకోర్టును సవాలు చేస్తూ సుప్రీం తలుపు తట్టగా జస్టిస్ ఎస్.అబ్దుల్లా, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం కేరళ హైకోర్టు తీర్పును తప్పు పడుతూ కొట్టి వేసింది. ఈ కేసులో తుది డిక్రీ జారీ ప్రక్రియను ట్రయల్ కోర్టు ఆలస్యం చేయడాన్ని సుప్రీం తప్పు పట్టింది.

"ఒక జంట భార్యాభర్తల్లా దీర్ఘకాలం పాటు కలిసి ఉంటే వారిని వివాహం చేసుకున్నట్లుగానే భావించాలి. సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 114 ఇదే సూచిస్తోంది. అలాగే ఇలాంటి సహజీవనంలో కలిగే సంతానానికి పూర్వీకుల ఆస్తిలో వాటా కూడా లభిస్తుంది. దీనిని అక్రమ సంతానంగా భావించకూడదు" అని సుప్రీం స్పష్టం చేసింది. అయితే ఈ తీర్పును ఎవరైనా సవాల్ చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే వారు పెళ్లి చేసుకోలేదని రుజువు చేయాల్సిన బాధ్యత సవాలు చేసిన వారిపైనే ఉందని సుప్రీం పేర్కొంది. ■

---

ప్రకారము 10 రోజులలో ఎఫ్ పి సి ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. మా కంపెనీ ద్వారా మూడు వందల మంది సభ్యులకు క్వింటాలుకు అదనంగా మూడు వందల నలభై రూపాయలు ఇవ్వడం లేదా లాభం చేకూరడం జరిగింది. అంటే అక్షరాల 19,50,000 వేల రూపాయలు అన్న మాట. ఈవిధంగా మా ఎఫ్ పి సి ద్వారా మా సభ్యులకు ఇవ్వడము మాకు ఎంతో ఆనందంగా ఉంది.

అంతేకాకుండా వచ్చే సీజన్‌లో మా హసనపర్తి ఎఫ్ పి సి ద్వారా దాదాపు వెయ్యి ఎకరాల ఫౌండేషన్ సీడ్ వెయ్యాలి అని, దాదాపు 6 కోట్ల రూపాయల బిజినెస్ చేయాలని ఒక లక్ష్యము ఏర్పాటు చేసుకున్నాం. అందుకు అనుగుణంగా ప్రణాళికలు చేసుకుని ఉన్నాం. ఇంతవరకూ మా హసన్‌పర్తి ఎఫ్ పి సికి సహకరించిన నాబార్డ్ ఏజీఎం శ్రీ చంద్రశేఖర్ గారికి ప్రత్యేకించి ధన్యవాదములు. వెన్నుతట్టి ప్రోత్సహించిన ప్రోత్సాహక పోతన సంస్థ సెక్రటరీ వెంకట్‌రెడ్డి గారికి మరియు ఏపీమాస్ సంస్థ గంగాధర్ గారికి మా హసనపర్తి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ తరపున ధన్యవాదములు తెలుపుతున్నాము. ■

---

## రైతుల సమాచారం బట్టబయలు !

కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్ ఒకటి దేశంలోని రైతుల ఆధార్ నంబర్లను బయటపెట్టేస్తున్నట్టు చెబుతూ సెక్యూరిటీ రీసెర్చర్ అతుల్ నాయర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వెబ్‌సైట్ రైతుల డేటాను బహిర్గతం చేసేస్తోందని ఆయన పేర్కొన్నారు. పీఎం-కిసాన్ సమ్మాన్ నిధినుంచి వచ్చే ఆదాయాన్ని పొందేందుకు రైతులు ఈ వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవడంతోపాటు ఆధార్ నంబరును కూడా ఇవ్వాల్సి ఉంటుంది. మిలియన్ల మంది రైతుల నుంచి సేకరించిన ఆధార్ వివరాలను ఈ వెబ్‌సైట్ బయట పెట్టేస్తోందంటూ అతుల్ నాయర్ కొన్ని ఆధారాలు కూడా చూపించారు. ■

# టమాట సాగుతో రైతే రాజు !

– అమరేంద్ర, చిత్తూరు

హైబ్రిడ్ టమాట పంట వేసి, అధిక లాభాలు ఆర్జించిన చిత్తూరు జిల్లా వి కోట మండలానికి చెందిన కృష్ణమూర్తి అనే రైతు విజయగాధ యిది. రైతు రాజు కావాలంటే హైబ్రిడ్ టమాటా పంట వేయవలసిందే అంటున్నారు శ్రీ కృష్ణమూర్తి. ఆయన అనుభవాలను ఆయన మాటలలోనే తెలుసుకుందాం.

---

**నా** పేరు కృష్ణమూర్తి, మాది నడమంత్రం గ్రామము, నేను వి.కోట మండల రైతు సమాఖ్యలో మెంబర్ని. అది అక్టోబర్ నెల 2021 మా ముదరందొడ్డి రైతు భరోసా కేంద్రంలో (ఆర్ బి కె) ఉద్యానశాఖ, ఏపిమాస్, వి.కోట మండల రైతు సమాఖ్య కలసి రైతులకు హైబ్రిడ్ టమాట గురించి సమావేశం ఏర్పాటు చేస్తున్నారని, ముందు రోజే







చెప్పడం వలన వెళ్ళాను. ఈ సమావేశానికి 32 మంది రైతులు వచ్చారు. ఈ సమావేశానికి వచ్చిన ఉద్యానశాఖ సహాయ అధికారి హైబ్రిడ్ టమాట పెంపకం గురించి అనేక విషయాలు చెప్పారు.

- ఆంధ్రప్రదేశ్ జీవనోపాధుల పెంపుదల పథకం (ఏ పి ఎల్ ఐ పి), వి.కోట మండల రైతు సమాఖ్య ద్వారా ఉద్యానశాఖ సహకారంతో హైబ్రిడ్ టమాట పంట పండించుటకు సహాయ సహకారములు అందించు చున్నాము. వంద ఎకరాలలో పండించుటకు అవకాశం వున్నది. ప్రతి రైతు 1 లేదా 2 ఎకరాలు వేయవచ్చు అని చెప్పారు.

- ప్రతి ఎకరం హైబ్రిడ్ టమాట వేస్తే నారుకు 6,000 రూపాయలు (రైతు బ్యాంక్ అక్కౌంట్) మల్చింగ్ పేపర్కు 12,000 రూపాయలు మరియు డ్రిప్ ఎరువులకు, సమగ్ర చీడ యాజమాన్యంకు కలిపి 16,600 రూపాయలు (రైతు సమాఖ్య ద్వారా) ఇవ్వడం జరుగుతుందని చెప్పడం జరిగింది.

రైతుల పేర్లు వి.కోట మండల రైతు సమాఖ్యకు, రైతు భరోసా కేంద్రంకు ఇవ్వాలని చెప్పడం జరిగింది. ఉద్యాన శాఖ అధికారి హైబ్రిడ్ టమాట పంట యాజ మాన్యం గురించి చెప్పడం జరిగింది.

ఏపిమాస్ సిబ్బంది ప్రతి రోజు సాయంత్రం ప్రతి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి హైబ్రిడ్ టమాట పంట సాగు మరియు ఆర్థిక సహాయం గురించి చెప్పడం జరిగింది. కానీ రెండు నెలలు అవగాహన కల్పించిన పంట సాగుకు ముందుకు వచ్చినది 20 మంది మాత్రమే.

- ఎందుకంటే మా మండలంలో ఇది వరకు హైబ్రిడ్ టమాట ఎవరు పండించలేదు / మార్కెట్ సౌకర్యం 65 కిలోమీటర్ల దూరంలో కోలార్ – కర్నాటక రాష్ట్రంలో వున్నది. అదియునూ ప్రభుత్వ ఆర్థిక సహాయం, రేటు తక్కువగా వుంటే వి.కోట మండల రైతుసమాఖ్య ద్వారా ప్రాసెసింగ్ సెంటర్కు మార్కెట్

**హైబ్రిడ్ టమాట సాగు ఫలాలు**

హైబ్రిడ్ టమోటా వేసిన రైతుల సంఖ్య : 20
సాగు విస్తీర్ణం ఎకరాలలో : 18
సరాసరి కోతలు: 7
మొత్తం పంట ...15 కిలోల బాక్సులు /క్రెట్స్ : 16,884
మొత్తం వచ్చిన డబ్బులు రూ : 1,30,68,216
సరాసరి ఎకరాకు దిగుబడి (కిలోలు): 12660
సరాసరి ఎకరాకు వచ్చిన డబ్బులు రూ : 7,26,012
సరాసరి సాగు ఖర్చు ఎకరాకు రూ : 70,880
నికరంగా ఎకరాకు మిగిలిన డబ్బులు: 6,55,132

చేసి ఇస్తాము అని చెప్పడం వల్లనే ! హైబ్రిడ్ టమాట సాగుకు ముందుకు వచ్చిన రైతులకు ఏపిమాస్ ఆఫీసు నందు మళ్ళీ ఒక రోజు అవగాహన కల్పించి,టమాట నారు కోసం ఇద్దరు రైతులు, ఏపిమాస్ సిబ్బంది కలసి కర్నాటక రాష్ట్రంలోని కోలార్ వెళ్ళి రైతు పండించు విస్తీర్ణం వారీగా వచ్చిన మొత్తం 18 ఎకరాలకు కొన్ని నర్సరీలు తిరిగి, మంచి నాణ్యతగా పెంచే నర్సరీలో ఇండెంట్ ఇవ్వడం జరిగింది. ఏపిమాస్ సంస్థ భరోసాతో నారు తెచ్చి 26 రోజులకు నాటుకొన్నాము.

- ఏపిమాస్ సిబ్బంది ప్రతి పొలంకు క్రమం తప్పక సందర్శించి చీడలకు, రోగాలకు సలహాలు ఇవ్వడం జరిగింది. మేము కావలసిన మందులను రైతు సేవా కేంద్రము నుండి తెచ్చుకొన్నాము. మేము పంట అయితే వేశాము కానీ, మార్కెట్ రేట్లు ఎట్లా వుంటాయో అని ఆందోళన చెందుతువుండేవారము. ఎందువలన అంటే గత రెండు సంవత్సరాల కరోనా కాలంలో పంటలకు పెట్టుబడి పెట్టి గిట్టుబాటు రేట్లు లేక పెట్టుబడి కూడా రాకుండా నష్టపోయాము. మేము ఫిబ్రవరి 2022న హైబ్రిడ్ టమాట మా పొలాలలో నాటుకొన్నాము. ఏప్రిల్ 2022 నెలలో పంట కోతకు వచ్చింది. 1వకోత 15 కిలోల క్రేటు 450/–రూపాయలు, 2వ కోత 575 రూపాయలు, ౦౦3వ కోత 650 రూపాయలు. మేము ఎక్కువ 750 రూపాయలకి క్రేటు అమ్మడం జరిగింది.

- రెండు సంవత్సరాలుగా ఏ పంటకు గిట్టుబాటు ధర లేని మాకు, ప్రతి కుటుంబానికి సరాసరి ఎకరా విస్తీర్ణానికి రూ.లు రావడం జరిగింది, కరోనా కాలంలో వచ్చిన నష్టాన్ని భర్తీ చేసికొన్నాము మరియు కొద్ది డబ్బులు భవిష్యత్తు అవసరాలకు వుపయోగించు కొంటాము. వ్యవసాయానికి పెట్టుబడులు పెట్టి పెట్టి రెండు



సంవత్సరాలుగా నష్టపడి వ్యవసాయమే వద్దు అనుకొన్న మాకు సహకరించిన ఏపిమాస్ సంస్థకు మరియు వి.కోట మండల రైతు సమాఖ్యకు కృతజ్ఞత తెలియజేస్తున్నాము. ■

**'భూమాత' ఎఫ్ పి ఓ చే మొక్కల పంపిణీ**

**08**-06-2022 తేదిన ఏ ఎఫ్ ఏకాలజి సెంటర్, ఏపిమాస్ ప్రాజెక్ట్ లోని భూమాత మహిళా రైతు ఎఫ్ పి ఓ అధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇంటి దగ్గర మొక్కలు నాటుకోవడానికి సస్యమిత్ర గ్రూపులకు చెందిన రావులచెరువు గ్రామంలోని 110 మందికి, బత్తలపల్లి గ్రామంలో 50 మంది వాటాదారులకు ఒక్కొక్కరికి 3 మొక్కల ప్రకారం (1 జామ, 1 మామిడి, 1 నిమ్మ మొక్కలు) ఎకాలజి సెంటర్ కో ఆర్డినేటర్ రిజ్వాన గారు, భూమాత పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో రిజ్వాన గారితో పాటు భూమాత పాలకవర్గ సభ్యులు, ధర్మవరం మండల టీం లీడర్ రమేష్ గారు, రాఘవేంద్ర గారు, లక్ష్మీదేవి గారు పాల్గొన్నారు. ■

# మామిడిలో కొమ్మకత్తిరింపులకు తగిన అదను ఇదే !

- శ్రీను శ్రీ

మన రెండు తెలుగు రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాలలో ప్రధానమైన పండ్లతోటగా మామిడి పండిస్తున్నారు. ఫలరాజు అయిన మామిడి సాగుకు మన రాష్ట్రంలోని వాతావరణం చాలా అనుకూలంగా ఉండి మంచి నాణ్యమైన దిగుబడి ఇస్తుంది. మన రాష్ట్రంలో పండించిన మామిడి పండ్లను మన





దేశంలోనే కాక ఇతర దేశాల వారు కూడా దిగుబడి చేసుకొని ఇష్టంగా తింటారు.

మామిడిలో అధిక దిగుబడి రావాలన్నా, ఎక్కువ కాలం దిగుబడి రావాలన్నా మామిడి తోటలో కొమ్మ కత్తిరింపులు ముఖ్యమైన అంశం. కొమ్మ కత్తిరింపులు సరిగా చేసుకో గలిగితే మంచి దిగుబడి సాధించవచ్చు.

**కొమ్మ కత్తిరింపులు ఎలా చేయాలి**

- చెట్టుపైన సూర్యరశ్మిని నిరోధించే గుబురైన కొమ్మలను కత్తిరించి, చెట్టుకు గాలి, వెలుతురు బాగా ప్రసరించేటట్టు చూడాలి.
- మొక్కకు భూమి నుండి 50 సెం. మీ. వరకు కొమ్మలను రానివ్వకూడదు. ఆపైన ప్రధాన కాండం మీద 2 లేదా 3 బలమైన కొమ్మలను పెరగనివ్వాలి. మిగతావి తీసివేయాలి.
- పక్కకొమ్మల పొడవు 80 సెం. మీ.లు ఉంచి చివర్లు కత్తిరించాలి. ఈవిధంగా నిర్ధారించిన ఆకారం వచ్చేవరకు చేయాలి.
- పెద్ద చెట్లలో ప్రతి సంవత్సరం కాయ కోత తర్వాత జూన్ – జులై మాసాల్లో అడ్డదిడ్డంగా పెరిగే కొమ్మలను, రెమ్మలను తీసివేయుట వలన సూర్యరశ్మి చెట్టంతా బాగా సోకి మంచి కాపునిస్తుంది.
- చెట్లనుంచి కాయలు కోశాక మిగిలిపోయిన తొడిమలను కత్తిరించాలి. కత్తిరింపులు చేసిన తరువాత ప్రతి రెమ్మ చివరి నుంచి 3–5 చిగుర్లు వస్తే రెండింటిని నిలుపు కొని మిగిలిన వాటిని అందిన మేర తీసివేయాలి.
- ఎండు కొమ్మలను, చీడపీడలు ఆశించిన కొమ్మలను మొదటి వరకు కత్తిరించి కొసలకు బోర్డియక్స్ మిశ్రమం లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను పూయాలి.

**కొమ్మ కత్తిరింపు సమయం**

- మామిడి కొమ్మలను కత్తిరించడానికి జూన్– జులై నెలలు అనువైన సమయం . మామిడి కోత అనంతరం చెట్టుకు 15 రోజులు విశ్రాంతి ఇచ్చి కత్తిరింపులు చేయాలి.
- కొమ్మల కత్తిరింపు అనంతరం బోర్డియక్స్ మిశ్రమం 1% పిచికారీ చేయాలి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- కొమ్మను రంపంతో కత్తిరించాలి. పెద్ద కొమ్మలు (20 సెం. మీ వ్యాసం) కత్తిరించుటకు మోటారు (పెట్రోల్) తో నడిచే రంపాన్ని ఉపయోగించాలి.
- కొమ్మలను కత్తిరించేటప్పుడు 45 డిగ్రీల కోణంలో కత్తిరించాలి. కత్తిరింపులో కొమ్మ క్రింది భాగం చెల్లకుండా చూచుకోవాలి.
- కత్తిరించిన తరువాత కాపర్ ఆక్సిక్లోరైడ్ (బ్లైటాక్స్)




మామిడి తోటల్లో చెట్లు ఏటవాలుగా పెరగటం వలన సస్యరక్షణ యాజమాన్యం కష్టసాధ్యమవుతుంది. ఇటువంటి ముదురు తోటలను సాంకేతికయాజమాన్య పరిజ్ఞానంతో కూడిన పునరుద్ధరణ ప్రక్రియ ద్వారా మళ్ళీ అధిక దిగుబడులు పొందేటట్లు చేయవచ్చు. చెట్టు మొదలు భాగం నుండి 4 మీ ఎత్తులో మొత్తం కొమ్మలను కత్తిరించాలి.

చెట్లు ప్రధాన కాండంపైన 3–4 ద్వితీయ క్రమ కాండాలను ఎంపిక చేసుకొని, చెట్ల ఆకృతి మారకుండా కత్తిరింపులు చేయాలి. ఎంపిక చేసుకున్న కొమ్మలను కత్తిరించేటప్పుడు బెరడు, కొయ్య చీలకుండా ముందుగా కొమ్మ అడుగు భాగం 10 – 20 సె. మీ లోతు కోసి తర్వాత పై భాగం కొయ్యాలి. దీనికి సరైన సమయం నవంబర్ – డిసెంబర్. ఈ విధంగా కత్తిరించిన చెట్టుకు కొత్త రెమ్మలు, కొమ్మలు ముదిరి 2 – 3 సంవత్సరాలలో అధిక దిగుబడులు వస్తాయి.

**రెట్టింపు లాభాలు రావాలంటే ...**

కొత్తగా మామిడి తోటలు వేసుకునేటప్పుడు అధిక సాంద్రతలో (2మీ × 2 మీ) ఎకరానికి 160 మొక్కలు ఉండేటట్లు వేసుకోవాలి. దీనివలన ఉత్పాదకత పెరుగుతుంది, లాభాలు రెంట్టింపు అవుతాయి.

మొక్కలకు నీరు డ్రిప్ పద్ధతి ద్వారా అందిస్తూ, చెట్ల పాదులకు మల్చింగ్ చేయటం ద్వారా దిగుబడులు పెరుగుతాయి.

పైన పేర్కొన్న రెండు పద్ధతులను ఆచరించటం ద్వారా దిగుబడులు పెరిగి ఆదాయం రెట్టింపు అవుతుంది.

క్రమం తప్పకుండా కత్తిరింపులను జూన్–జులై నెలలలో చేసుకోవాలి.

సిఫార్సు చేసిన ఎరువులను క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం వాడాలి.

సూక్ష్మధాతులోప నివారణకు జింక్ , బోరాన్ ఏడాదికి 3, 4 సార్లు సిఫారసు మేరకు పిచికారీ చేసుకోవాలి.

పేస్టును పూయాలి.

- చిన్న చిన్న కొమ్మలను చేతిద్వారా కత్తిరించడానికి సీకేచర్‌ను (లాంగ్రిచ్ ప్రూనర్) ఉపయోగించాలి
- సన్నపాటి కొమ్మలను కత్తిరించేటప్పుడు చిన్నపాటి సీకేచర్ ఉపయోగించాలి.

**దిగుబడి క్షీణతకు ప్రధాన కారణాలు**

- తోటను వేసుకునే ముందు నాణ్యమైన మొక్కలను ఎంచుకోకపోవటం
- అధిక శాతం తోటలలో, ఎత్తు ఎక్కువ పెరిగే రకాలను సాగు చేయటంతో కొమ్మ కత్తిరింపులు చేయకపోవటం.
- సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించకపోవడం
- క్రమం తప్పిన నీటియాజమాన్యం.
- సరైన సమయంలో చీడపీడలు నివారించకపోవటం.
- మామిడి తోటలు వయస్సు పైబడినవి కావడం
- పంట కోతకు ముందు, కోతకు తరువాత సరైన పద్ధతులను పాటించకపోవడం ... మొదలగునవి.

**పునరుద్ధరణ**

మన రాష్ట్రంలో లేత మామిడి తోటలు (10–20 సం.ల వయస్సు) ఎక్కువ శాతమే వున్నప్పటికి ముదురు మామిడి తోటలు (25–30 సంల) కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ ముదురు మామిడి తోటలలో ఉత్పాదకత ప్రతి సంవత్సరం గణనీయంగా తగ్గుతూ వస్తుంది.

ముదురు తోటలలో దిగుబడి , కాయ నాణ్యత తగ్గడానికి ముఖ్య కారణాలు:

చెట్ల పాదుల్లో, చెట్ల మొదలుపై సూర్యరశ్మి పడక పోవటం వలన చీడపీడలు ఆశించి ఫలసాయం తగ్గుతుంది.

కోపమెందుకు? నీవు చెప్పేది సరైనదైతే కోపంతో పనిలేదు, సరైనది కాకుంటే కోపించే అర్హత లేదు

# మహిళా సాధికారత - వ్యాస రచయితలు , రచయిత్రులు (2002-2022)

1. జి.సత్య శ్రీనివాస్
2. ఎన్.శ్రీనివాస రావు
3. చల్లా నాగార్జున
4. చల్లం నారాయణరెడ్డి
5. మాధవీలత
6. జె. మురళి
7. సునీతా ప్రసాద్
8. త్రివిక్రమదేవి
9 ఎం. శ్రీధర బాబు
10. కరుణాకర్
11. జి.ఏ.స్వామి
12. డి. రాజేశ్వర్
13. దాసరి అంజయ్య
14. ప్రభావతి
15. ఎస్ రామలక్ష్మి
16. గౌతమ్ రెడ్డి
17. ఫణిప్రియ
18. కె.విజయకుమార్
19. పి.రమాదేవి
20. సి. సువర్ణ
21. రాజేష్
22. మంజుల
23. డి.వి.సుబ్బారెడ్డి
24. ఏ.వి. రాజా
25 ఎస్.పి. సుజారాణి
26. నాగేష్
27. వై. ఆరోగ్యరెడ్డి
28. ఎన్. వినాయకరెడ్డి
29. నాగశిరోమణి
30. కె.వి.భాస్కర్
31. ఎం. శ్రావణ్‌కుమార్
32. కె. రాజారెడ్డి
33. శ్రీనాథ్
34. ఎస్.సుభాషిణి
35. వై. రామకృష్ణ
36. వి.ఎం. కిరణ్
37. బి. గీతాంజలి
38. బి. జంగయ్య
39. సి.హెచ్. పద్మజ
40. నీలిమ
41. కవిత
42.ఎంబి సుబ్రహ్మణ్యం రెడ్డి
43. ఎన్. బాలపోచయ్య
44. భారతి
45. వనజ
46. కె. ఉగేంద్రనాథ పిళ్ళై
47. టి.సుధారాణి
48 హరనాథ్
49. విజయభవాని
50. పి.సుధాకర్
51. పద్మజ
52. టి.ఎన్.స్నేహన్
53. రమాజ్యోతి
54. బి. వెంకటేశ్వర్లు
55. సుమిత్ర
56. బి. ఆంజనేయులు
57. పి.జయంత్ కుమార్
58. కె.వి.భాగ్య
59. జి.సురేష్
60. సోఖిల సురేష్
61. ఎన్.ప్రమీలా కిషోర్
62. జె.వి.క్రిష్ణమూర్తి
63. నూర్ అహ్మద్
64. ఎం. శ్రీనివాసరావు
65. సురేష్
66. పి. లక్ష్మి
67. డి. గీత
68. టి.ఎల్.నర్సింహారావు
69. ఎం. గణేష్
70. ఎన్. మనోహర రెడ్డి
71. ఆర్.అంకయ్య
72. సి.హెచ్.రవికుమార్
73. వి.ఉమాదేవి
74. ఎం. ఈశ్వరయ్య
75. పి. తిరుపతి
76. శివరాం
77. అహ్మద్
78. కె. దీపికా మోజెస్
79. వి శ్యామలాంబ
80. అనూరాధ
81. శాంతిదుర్గ
82. శాంతి
83. నాగమ్మ
84. రాధశ్రీ
85. జవహర్ బాషా
86. సి. రామాంజులు
87. పి.వెంకటరమణ
88. మాధవి
89. షేక్ రఫీ
89. ఎస్.విజయశేఖర రాజు
90. డి.వెంకటేశ్వర్లు
92. జి. పుష్పావతి
93. సి.గోపాలరాజు
94. టి.ఏ.కిశోర్
95. జి.వి. చక్రవర్తి
96. అర్జున్ ప్రసాద్
97. ఎన్.కె. మేఘమాల
98. డి. సుభాష్
99. కె.వెంకటేశ్వరరావు
100. ఎల్. మల్లిక్
101. ఎస్.రాజేశ్వర్
102. జి. భాస్కరరావు
103.ఎం.రామ్మూర్తినాయుడు
104. కె. వరలక్ష్మి
105. వి.బి.మోహన్
106. సి.హెచ్.వెంకటేశ్వర్
107. ఎస్. ప్రహ్లాద
108. బి. రాజశేఖర్
109. బి.పెద్దన్న
110. పి.వెంకటేశం
111. ఎస్సారె
112. ఎల్ .సత్యం
113. టి. మనోహర స్వామి
114. ఎం. కృష్ణ సుమంత్
115. బి. సోములు
116. పి. శశికుమార్
117. సి. హెచ్. సంధ్య
118. బి. నరసింహులు
119. కె. ఓబిలేష్
120. జి.కృష్ణారావు
121. పి.ఆర్.వి.రమణారెడ్డి
122. జె.ఎస్.ఆర్.కె. శర్మ
123. ఎల్. చెన్నారెడ్డి
124. కె. నవీన్ కుమార్
125. బి. కుల్లాయమ్మ
126. మాధవి
127. ఎం. ఏ. వనజ
128. వి. సమత
129 ఆర్.భాస్కర్
130 ఎం. నాగిరెడ్డి
131. కె. లక్ష్మీ నాంచారమ్మ
132. చెన్నారెడ్డి
133. రఫియా
134.సిహెచ్.సంధ్యాకుమారి
135. బి.ఉమాశంకర్
137. జి.పాపారావు
138. బి వెంకటస్వామి
139. బి. చిన్నబాబయ్య
140. ఎం.శివరామకృష్ణ
141. పి.రమేష్
142. పి.రామకృష్ణశర్మ
143. పి.శైలజ
144. వి.వి. ప్రసాదరావు
145. పి. మల్లీశ్వరి
146. కె. గోవిందరాజు చౌదరి
147. బ్రహ్మయ్య
148. కె. బదరీష్
149. డి. శిరీష

150. కె.లక్ష్మీదేవి
151. కె.నాగమల్లేశ్వరి
152. ఎం.రామమోహనరావు
153. జి. వరలక్ష్మి
154. కె. శ్రీధర్
155.సిహెచ్.శ్రీనివాసరావు
156. టి పాండు
157. రాజనరసయ్య
158 టి. మనోప్రియ
159. కె. మీనాక్షి
160 ఎం.వి.రమణయ్య
161. కె.సుశీల
162. బి. వెంకటేశ్వర రెడ్డి
163. కె. వసుమతి
164. ఇ. రఘునాథ్
165. బి. అమర దేవేంద్ర
166. అనిల్
167. నాగరాజారావు
168. మిత్రా
169. పి.లక్ష్మీ నారాయణ
170. టి.సావిత్రి
171. ఏ.హెచ్.టయాడే
172. బి.జె.రామమోహనరావు
173. డాక్టర్ మైనంపాటి
174. శ్రీనివాసరావు
175. జి. ఆర్. అమరేంద్రుడు
176. జి.శ్రీనివాస్
177. ఎస్. ప్రహ్లాద
178.ఏపిమాస్ రామసముద్రం బృందం
179. జి4ప్రాజెక్ట్ సిబ్బందిబృందం
180. మదనపల్లిజిఐసిబృందం
181. అనంత,భూమాత ఎఫ్‌పిఓల సిబ్బంది బృందం
182. పి.అపర్ణ
183. కె.జి.రామాంజనేయులు
184. డి.జగన్‌మోహన్‌రెడ్డి
185. వాసుదేవరెడ్డి
186. టి. పాండురంగారావు
187. బి. ఎర్రంరాజు
188. డాక్టర్ శ్రీధర్ కొల్లూరు
189. జి. రాందాస్
190. డాక్టర్ పి. సంధ్యారాణి
191. వి. హేమంత్ కుమార్
192. బి. ప్రవల్లిక
193. డాక్టర్ వి. ఉమాదేవి
194. ఎస్ రామలక్ష్మి
195. జి ఈరన్న
196. చెంగిచెర్ల వేణుగోపాల్
197. కె. సంతోషచారి
198. బోడ హరిలాల్
199. గంగులప్ప
200. సి. రవీంద్ర రెడ్డి
201. రాజోజుల బ్రహ్మాచారి
202. జి వై సతీష్ కుమార్
203. ఎన్ నరసింహప్ప
204. ఇ. దేవరావు
205. పి. గంగాధర్
206. ఏ. గుణశేఖర్
207. ప్రదీప్ కుమార్
208. కె. సుధ
209. ఎన్ నవీన్ కుమార్
210. చక్రపాణి
211. పి రాజీవ్ రెడ్డి
212. ఎం వెంకటరమణరాజు
213. మునిగల్ సుభాష్
214. ఇ. దేవీరావు
215. వి. ఆరుణ్ కుమార్
216. ఏ. కరుణాకర్ రెడ్డి
217. డి. శ్రీనివాస రావు
218. పి ఫకృన్నీసా
219. ఎస్ సుజాత
220. ఎం ఆర్షద్ అహ్మద్
22o1. ఆర్ భాస్కరరావు
222. డి నాగరాజు
223. ఎన్. రెడ్డెప్ప రెడ్డి
224. కనకం రాజ్‌కుమార్
225. మహేందర్
226. చంద్రశేఖర గౌడ్
227. శ్రీ నిశాంత్
228. సి రాజశేఖర రెడ్డి
229. స్వయం శంకర్
230. సాజిత్
231. శ్రీనునాయక్
232. కె.పద్మావతి
233. జయరాం కిల్లి
234. శ్యాంమోహన్
235. పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి
236. సి.హెచ్. మీనాక్షి
237. పూర్ణిమ
238. కె. లోకేష్
239. జి.రంగయ్య
240. డి నాగలక్ష్మి
241. డి విజయలక్ష్మి
242. వి.లక్ష్మీదేవమ్మ
243. బి. సుభాషిణి
244. హర్షవర్ధన్ రెడ్డి
245. ఎస్ కిషోర్‌కుమార్
246. హనుమంతురాయప్ప
247. ఎల్ భవాని
248. శ్రీకాంత్
249. సి హెచ్ వినోద
250. అంజుమ ఫాతిమ
251. బి.అశోక్ కుమార్
252. ఎస్ ఎస్ రెడ్డి
253. కాళేశ్వర్
254. మధువని
255. విజయ్‌కుమార్ నాయక్
256. యస్. మధు
257. నాగేష్ గౌడ్
258. వి. నారాయణస్వామి
259. ఎన్ హరికృష్ణ
260. శిల్ప
261. వి. మహేశ్వరి
262. టి.అమృత
263. నందిని
264. కామాక్షి కుమారి
265. వరప్రతాప్
266. దుద్దుకూరి నాగలక్ష్మి
267. వెంగల్ రెడ్డి
268. అరుణతార
269. బి. శ్రీలత
270. దివ్యశ్రీ
271. మంజుల
272. వి.రామరాజు
273. కె. నిమ్మయ్య
274. బదావత్ వెంకన్న
275. లిఖిత శ్రీరాం
276. ఎ. భవాని
277. బి. భవాని
278. అర్రోజు కుమారస్వామి
279. రమేష్ రెడ్డి
280. డాక్టర్ వీణ
281. బి. శ్రీనివాస్
282. అబ్దుల్ ఖాదర్
283. వేద్ ప్రకాశ్ సింగ్
284. నీవా సి
285. ఎస్.శారద
286. ఎ.నాగమల్లిక
287. షేక్ బాబా
288. దుర్గం అనిల్
289. పవన్ కుమార్
290. జి.ఆర్లిన్ క్రిస్టినా
291. ఎం.షణ్ముఖ
292. డాక్టర్ భార్గవి
293. తోమల కిషోర్
294. కె.భవ్యశ్రీ
295. అమిర్నేని హరికృష్ణ
296. కన్నెగంటి రవి
297. క్రిస్టోఫర్ వసంత్ ■

**జీవితంలో ప్రతి పరీక్ష మన సామర్థ్యాన్ని మరింత పెంచుతుంది, లేదా చేతగానితనాన్ని చాటుతుంది**

## వాళ్ళ ఇంటి లోపల ఎవరైనా టాయిలెట్ నిర్మించవచ్చు ప్రభుత్వ సబ్సిడీ మరియు రుణ సహాయంతో

- మరుగుదొడ్డిని నిర్మించుకునేందుకు ప్రభుత్వ సబ్సిడీ పొందండి
- ఎస్‌హెచ్‌జిలు/బ్యాంకులు/నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందండి
- మరింత సమాచారం కోసం, పంచాయతీ అధికారి/ప్రభుత్వ అధికారి/ఎన్‌జిఒను సంప్రదించండి



## పరిశుభ్రమైన గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, సంతోషకరమైన గ్రామం

- మరుగుదొడ్డి ఉపయోగించడం సౌలభ్యంగా ఉంటుంది
- పిల్లలు మరియు మహిళలకు భయం మరియు సిగ్గుపడవలసిన అవసరం లేదు
- వ్యాధుల వ్యాప్తిని నివారించండి
- పిల్లల చదువు లేదా కుటుంబ ఆదాయం ప్రతికూలంగా ప్రభావితం కావు

- రెండు గుంతల నిర్మించండి
- నీటి కనెక్షన్ ఇన్‌స్టల్ చేయండి
- సులభ లోన్ పొందండి
- మీ కుటుంబాన్ని సంతోషపెట్టండి



नाबार्ड



नाबार्ड

# స్వచ్ఛత ఉద్యమం

రోజూ మరుగుదొడ్డి ఉపయోగించండి
మీ కుటుంబంలో ఆరోగ్యం మరియు
సంతోషం నింపండి



అభివృద్ధి
— కోసం —
పారిశుధ్యం
— నాబార్డు సౌజన్యంతో —
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి

## బహిర్భూమికి వెళ్ళడం అంటే మీ ఇబ్బందులను పెంచుకోవడమే:



జబ్బులు- అతిసారం, నీళ్ళ విరేచనాలు, కరోనా వైరస్ ఇన్ఫెక్షన్.

కాలుష్యం- భూమి కాలుష్యం, నీటి కాలుష్యం





మహిళలకు భయం మరియు సిగ్గు

## ఇంట్లో మరుగుదొడ్డి ఉండగా బహిర్భూమికి ఎందుకు వెళ్ళాలి?

నీటి కనెక్షన్ లేదా?





మరుగుదొడ్డి గుంత నిండిపోయిందా?

మరుగుదొడ్డికి మరమ్మతులు అవసరమా?



## పరిష్కారాలు సులభమమైనవి:



మీ మరుగుదొడ్డి నీటి కనెక్షన్ పొందండి

మా మరుగుదొడ్డి జత గుంతలు నిర్మించుకోండి





అవసరమైతే మీ మరుగుదొడ్డి రెండు గుంతల మరుగుదొడ్డి నిర్మించండి

నీటి సదుపాయం కల్పించండి



MAHILA SADHIKARATHA
Publication Date: 01-07-2022 ; Posting Date: 05 & 06-07-2022

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23




అనంత ఎఫ్ పి ఓ కార్యక్రమాలు : 'వినియోగదారులకు చేరుబాటు'లో జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి... పర్యావరణ దినోత్సవం




చొల్లేరు లో ఆజీవ ఎఫ్ పి ఓ పర్యావరణ దినోత్సవం




పర్యావరణ దినోత్సవం సందర్భంగా భూమాత ఎఫ్ పి ఓ మొక్కల పంపిణీ ... ధీశాలి ఎఫ్ పి ఓచే పర్యావరణ దినోత్సవం





కామారెడ్డి కలెక్టర్ శ్రీ జితేష్ బి పటేల్ తో ఎస్ హెచ్ జి సమాఖ్యలపై జాతీయస్థాయి శిక్షణ బృందం ... ఏపిమాస్ లో గ్రూప్ ఫోటో

To ADDRESS



ఎస్ హెచ్ జి సమాఖ్యలపై జాతీయ స్థాయి
శిక్షణలో మరో దృశ్యం

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089